ప్రీపెయిడ్ కరెంటు..!

స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు ప్రభుత్వం సన్నాహాలు



స్మార్ట్‌మీటరు

రీచార్జి ఆలస్యమైతే అంధకారమే..
ప్రీపెయిడ్‌పై వినియోగదారుల్లో వ్యతిరేకత
రాయితీ ఉంటుందా.. ఊడుతుందా అని ఎస్సీ, ఎస్టీల్లో అయోమయం
ఎన్నికల తర్వాత రుద్దుడుకు సిద్ధం..!

పుట్టపర్తిరూరల్

రైతుల పక్షపాతిగా చెప్పుకునే వైసీపీ ప్రభుత్వం.. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ మంగళం పాడే దిశగా అడుగులు వేస్తోంది. ప్రీపెయిడ్ స్మార్ట్ విద్యుత్ మీటర్లు బిగించే ప్రయత్నాలు మొదలుపెట్టింది. వ్యవసాయ మోటార్లకు ఈ మీటర్లు బిగిస్తే రైతులు ముందుగా విద్యుత్ కోసం రీచార్జి చేసుకోవాల్సి ఉంటుంది. ఉచిత విద్యుత్‌పై స్పష్టమైన ప్రకటన రాకపోవడంతో రీచార్జి, ఉచిత విద్యుత్‌పై రైతుల్లో ఆందోళన నెలకొంది. ఉచిత విద్యుత్‌కు మంగళం పాడేస్తారేమోననే ఆందోళన రైతుల్లో వ్యక్తం అవుతోంది. విద్యుత్ రంగంలో కేంద్రప్రభుత్వం తీసుకొస్తున్న సంస్కరణలను రాష్ట్రప్రభుత్వం తూచ తప్పకుండా అమలు చేస్తోంది. ఇప్పటికే వ్యవసాయ మోటార్లకు మీటర్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. తాజాగా అన్ని విద్యుత్ సర్వీసులకు ప్రీపెయిడ్ మీటర్లు బిగించడానికి సన్నాహాలు మొదలుపెట్టింది. ఇందుకు సంబంధించి రైతుల ఆధార్ కార్డు, బ్యాంకు పాసుపుస్తకం, పట్టాదారు పాసుబుక్కు నకలు సేకరిస్తున్నట్లు రైతన్నలు చెబుతున్నారు.

రీచార్జి చేయకుంటే అంధకారమే..

జిల్లాలో అన్నిరకాల విద్యుత్ కనెక్షన్లు 5.16 లక్షలున్నాయి. వీటిలో వ్యవసాయ సర్వీసులు 1.29 లక్షలు, వాణిజ్యానికి సంబంధించి 48297 ఉన్నాయి. ముందుగా ప్రభుత్వ సంస్థలు, 200 యూనిట్ల పైబడి విద్యుత్ వినియోగించే వాణిజ్య ఇతర సర్వీసులకు స్మార్ట్ మీటర్లు అమర్చనున్నట్లు తెలుస్తోంది. తద్వారా విద్యుత్ వినియోగంలో కచ్చితత్వం ఉంటుందన్నది రాష్ట్రప్రభుత్వ వాదన. ఇవి ప్రీపెయిడ్ మీటర్లు. సెల్‌ఫోన్ ప్రీపెయిడ్ రీచార్జి తరహాలో పనిచేస్తాయని సమాచారం. ఫోన్‌కు ఎలాగైతే గడువులోపు రీచార్జి చేయకపోతే.. సేవలు ఆగిపోతాయో.. విద్యుత్ స్మార్ట్‌మీటర్లు కూడా అంతే. అంధకారమే. ఇలాంటి ప్రీపెయిడ్ విద్యుత్ మీటర్ల విధానాన్ని తీసుకొచ్చేందుకు చర్యలు చేపడుతున్నారు. ఈ విధానంలో ప్రతినెలా సెల్‌ఫోన్ ద్వారా కరెంటు రీచార్జి చేసుకోవాల్సి ఉంటుంది. ప్రభుత్వ విభాగాలు, స్థానిక సంస్థల కార్యాలయాలు, వాటి పథకాలు, పారిశ్రామిక, వాణిజ్య వినియోగదారులకు వెంటనే ప్రారంభించి డిసెంబరు 2030 నాటికి ప్రతి కనెక్షన్ స్మార్ట్ మీటరు (ప్రీపెయిడ్) ఏర్పాటు చేయాలని విద్యుత్ పంపిణీ సంస్థలను కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. వీటి ఏర్పాటుకు నిర్దేశిత కాల వ్యవధిని ఉత్తర్వుల్లో పేర్కొంది. దీని ప్రకారం దశలవారీగా రానున్న రెండేళ్లలో రాష్ట్రంలోని వినియోగదారులందరికీ స్మార్ట్‌మీటర్ల బిగింపు ప్రక్రియ పూర్తి చేయాలని స్పష్టం చేసింది. ప్రభుత్వ విభాగాలు, స్థానిక సంస్థల కార్యాలయాల విషయంలో ప్రీపెయిడ్ మీటర్ల అమలు సాధ్యాసాధ్యాలపై చర్చ సాగుతోంది. రీచార్జి చేసుకుని, విద్యుత్ వాడుకునే పరిస్థితి ప్రస్తుతానికి ఏ కార్యాలయానికీ లేదు. ఇప్పటికే వివిధ రకాల నిధులు ప్రభుత్వం దారి మళ్లిస్తూ స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసిందనే విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. గ్రామ పంచాయతీల్లో కొందరు సర్పంచ్‌లు సొంత నిధులతో ప్రజల కనీస అవసరాలు తీర్చడానికి నానా అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో కార్యాలయాలకు నెలానెలా విద్యుత్‌కు ముందస్తు పెట్టుబడి ఎవరు పెడతారన్నదే సర్వత్రా వ్యక్తమవుతున్న ప్రశ్న. ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, స్థానిక సంస్థల కార్యాలయాలకు సంబంధించి సుమారు రూ.538 కోట్ల విద్యుత్ బకాయలు ఉన్నాయి. వీటి వసూలుకు విద్యుత్ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. అప్పుడప్పుడూ కార్యాలయాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నారు కూడా. ఆ సమయంలో కొంత మొత్తం చెల్లించి, విద్యుత్ సరఫరా పునరుద్ధరించుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తే ముందస్తుగా రీచార్జి చేసుకుని తీరాలి. ఇది ఆచరణలో ఎంతవరకు సాధ్యమవుతుందనే సందేహం తలెత్తుతోంది.

అయోమయంలో రీడర్లు



స్మార్ట్‌మీటర్ల ఏర్పాటుపై రీడర్లలో భయాందోళనలు నెలకొన్నాయి. ప్రతినెలా ఇంటింటికీ వెళ్లి విద్యుత్ వాడకంపై బిల్లులు అందజేసే రీడర్లు.. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తే తమ పరిస్థితి ఏమవుతోందోననే ఆందోళనలో ఉన్నారు. జిల్లావ్యాప్తంగా 450 మంది వరకు రీడర్లు పనిచేస్తున్నారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తే ఇక నేరుగా బిల్లు ఇచ్చే అవసరం ఉండదు. సెల్‌ఫోన్‌కే మెసేజ్‌లు వెళ్లిపోతాయి. దీంతో రీడర్ల అవసరం ఉండదనే విషయం వారికి ఉన్నతాధికారులు చెప్పడంతో తమ ఉపాధికి ఎక్కడ ఎసరు వస్తుందోననే ఆందోళనలో రీడర్లు ఉన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు వర్తిస్తుందా?

విద్యుత్ పంపిణీలో పేద ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు ప్రభుత్వం రాయితీలు కల్పిస్తోంది. ప్రీపెయిడ్ మీటర్లు ఏర్పాటు చేస్తే వీరికి రాయితీలు ఎలా అందిస్తారన్న సమస్య ఉత్పన్నమవుతోంది. ప్రభుత్వం వీటిపై స్పష్టత ఇవ్వకపోవడంతో పేద ఎస్సీ, ఎస్టీ వినియోగదారుల్లో ఆందోళన మొదలైంది. ప్రస్తుతం రాష్ట్రంలో వ్యవసాయానికి ఉచితంగా విద్యుత్ అందిస్తున్నామని ప్రభుత్వం చెబుతోంది. వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగిస్తే సెల్‌ఫోన్ తరహాలో ముందుగా రీచార్జి చేసుకోవాల్సి ఉంటుంది. ఉచిత విద్యుత్తుపై స్పష్టమైన ప్రకటన రాకపోవడంతో గుబులు పట్టుకుంది. ఉచిత విద్యుత్తుకు మంగళం పాడేస్తారేమోనన్న అందోళన రైతుల నుంచి వ్యక్తమవుతోంది.

ఎన్నికల తర్వాత రుద్దుడే

వ్యవసాయ మోటార్లకు మీటర్ల బిగింపు ప్రక్రియపై జిల్లాలో అనేకచోట్ల రైతుల నుంచి ప్రతిఘటన ఎదురవుతోంది. ఇందులో భాగంగా గత నెలలో మడకశిర మండలం కల్లుమర్రి ప్రాంతంలో మోటార్లకు మీటర్లు బిగించే కార్యక్రమంలో భాగంగా విద్యుత్ శాఖ అధికారులకు రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఎన్నికల సమయం దగ్గర పడుతుండటంతో రైతుల నుంచి వ్యతిరేకత రావడంతో మోటార్లకు మీటర్ల బిగింపు ప్రక్రియకు తాత్కాలికంగా బ్రేక్‌పడినట్లు తెలుస్తోంది. ఎన్నికల తర్వాత రైతన్నలకు రుద్దుడు తప్పదన్న వాదనలు వినిపిస్తున్నాయి.

ప్రతిపాదన దశలో ఉంది

స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు ఇంకా సమయం పడుతుంది. ప్రతిపాదనల దశలోనే ఉంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే చర్యలు తీసుకుంటాం.

- మోషెస్, డీఈఈ, ఎస్పీడీసీఎల్

చంద్రబాబును కలిసిన బీకే


చంద్రబాబుతో బీకే

హిందూపురం, ఫిబ్రవరి 26: టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడును పార్టీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి సోమవారం కలిశారు. టీడీపీ-జనసేన ఉమ్మడి తొలి జాబితాలో పెనుకొండ నుంచి సవిత పేరును అధిష్ఠానం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ తరుణంలో పార్థసారథి వర్గీయులు తమ నాయకుడికి ఇవ్వాలని నిరసన తెలిపారు. విషయం అధిష్ఠానం దృష్టికి చేరడంతో చంద్రబాబు నుంచి పార్థసారథికి పిలుపు వచ్చింది. దీంతో ఆయన ఆదివారం మధ్యాహ్నం విజయవాడకు వెళ్లారు. సోమవారం చంద్రబాబుతో కలిశారు. చంద్రబాబు ఏమి చెప్పారనే విషయం మాత్రం బయటకు పొక్కలేదు.

నేడు వైద్య ఉద్యోగుల ప్రత్యేక స్పందన

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 26: జిల్లాలోని వైద్య ఉద్యోగుల సమస్యలు పరిష్కరించే దిశగా మంగళవారం ప్రత్యేక స్పందన (అర్జీల స్వీకరణ కార్యక్రమం) నిర్వహించనున్నట్లు జిల్లా వైద్యాధికారి కృష్ణారెడ్డి సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు సమస్యలపై అర్జీలు స్వీకరిస్తామన్నారు. ఈ అవకాశాన్ని వైద్యఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె

ఉపాధి హామీ ఉద్యోగుల అల్టిమేటం... కలెక్టరేట్ ముందు నిరసన


కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఉపాధి హామీ ఉద్యోగులు

పుట్టపర్తి, ఫిబ్రవరి 26: తమ సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెకు దిగుతామని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఉద్యోగులు.. ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద నిరసనకు దిగారు. ఆ ఉద్యోగ సంఘం జిల్లా నేత రషీద్ మాట్లాడుతూ.. 16 ఏళ్లుగా తాము పనిచేస్తున్నామన్నారు. పీఆర్సీ 23 శాతం అమలు చేయాలనీ, గ్రేడింగ్ ఇవ్వాలనీ, ఎఫ్‌టీఈలుగా గుర్తించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. తమ డిమాండ్ల పరిష్కారం పట్ల పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెకు దిగుతామన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఉద్యోగులు మధుసూదన్ రెడ్డి, సాయినాథరెడ్డి, అమరావతి, జయమ్మ, మనోహర్, నంజిరెడ్డి, సికిందర్, జయరాంరెడ్డి, రాంబాబు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఏపీఓ, ఏపీడీల సమ్మె నోటీసు

సమస్యలు పరిష్కరించాలంటూ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఏపీఓ, ఏపీడీలు సమ్మె నోటీసును కలెక్టర్‌కు అందజేశారు. ఉద్యోగ విరమణ వయసు 62 సంవత్సరాలకు పెంచాలనీ, ఉద్యోగ భద్రత కల్పించాలనీ, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

రాళ్ల లారీలపై విజిలెన్స్ దాడులు

నకిలీ బిల్లులతో తరలిస్తున్నట్లు గుర్తింపు
చిలమత్తూరు, లేపాక్షిలో లారీల సీజ్


లేపాక్షి వద్ద విజిలెన్స్ అధికారులు సీజ్ చేసిన లారీలు

హిందూపురం, ఫిబ్రవరి 26: రాళ్ల తరలించే లారీలపై విజిలెన్స్ అధికారులు సోమవారం మెరుపుదాడులు నిర్వహించారు. చిలమత్తూరు, లేపాక్షిలో లారీలను పట్టుకుని, సీజ్ చేశారు. లారీల డ్రైవర్లు చూపించిన బిల్లులు నకిలీవని అధికారులు గుర్తించారు. దీంతో లారీలను సీజ్ చేశారు. చిలమత్తూరు మండలంలోని కొడికొండ చెక్‌పోస్టు వద్ద విజిలెన్స్ సీఐ సాయిప్రసాద్, ఎస్ఐ ఫణీంద్రనాథ్‌రెడ్డి, సిబ్బంది సోమవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా రాళ్ల లారీలు అటుగా వచ్చాయి. వాటిని ఆపి, బిల్లులను పరిశీలించగా.. అవి నకిలీవని తేలింది. అనంతరం లేపాక్షి వద్ద లారీలను ఆపి, బిల్లులు తనిఖీ చేయగా.. అవి కూడా నకిలీవని గుర్తించారు. దీంతో కొడికొండ చెక్‌పోస్టు వద్ద 3, లేపాక్షి వద్ద మరో మూడు లారీలను స్వాధీనం చేసుకున్నారు.

యజమానుల ఆందోళన

విజిలెన్స్ అధికారులు లారీలను సీజ్ చేసి, నకిలీ బిల్లులని చెప్పడంతో లారీల యజమానులు, డ్రైవర్లు ఆందోళనకు దిగారు. నకిలీ బిల్లులు ఇచ్చిన కార్యాలయం వద్దకు వెళ్లి ఆందోళన చేశారు. ఇటీవల ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన పాలసీ ఆధారంగా చిలమత్తూరుకు చెందిన వైసీపీ నాయకులు అమిగోస్ మినరల్స్ పేరుతో బిల్లు ఇచ్చారు. మరి కొన్ని బిల్లులైతే పేరే లేకుండా ఇచ్చారు. దీంతో అధికారులకు అనుమానం వచ్చి లారీలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. దీనిపై విజిలెన్స్ అధికారులను వివరణ కోరగా.. లారీలను స్వాధీనం చేసుకున్న మాట వాస్తవమేననీ, బిల్లులు లేనందున వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు.

ఫోన్ రావడంతో వెనక్కితగ్గిన అధికారులు

లారీలను సీజ్ చేసిన తరువాత చిలమత్తూరు మండలానికి చెందిన వైసీపీ నాయకులు ఓ మంత్రి పీఏకి ఫోన్ చేయగా.. అక్కడి నుంచి సంబంధిత అధికారులకు ఫోన్ రావడంతో వెనక్కి తగ్గి వెళ్లిపోయినట్లు సమాచారం. ఈ కారణంతోనే లారీలు పట్టుకున్నపుడు నకిలీ బిల్లులు అన్న అధికారులు 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. బిల్లులు లేకపోవడంతో సీజ్ చేసినట్లు చెప్పడం. దీని వెనుక ఆంతర్యమేమిటనేది తెలియాల్సి ఉంది.

చెరువు గుల్ల..!

ఎక్స్‌కవేటర్‌తో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు
ట్రాక్టర్లతో తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్న వైనం
కన్నెత్తిచూడని అధికారులు

మడకశిర రూరల్, ఫిబ్రవరి 26: అధికారాన్ని అడ్డంపెట్టుకుని వైసీపీ నాయకులు చెరువును గుల్ల చేస్తున్నారు. మండలంలోని మణూరు చెరువులో ఎక్స్‌కవేటర్ యథేచ్ఛగా మట్టి తవ్వకాలు చేపడుతున్నారు. పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో రెండ్రోజులుగా మట్టిని అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అంతా పబ్లిక్‌గానే సాగుతున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. మట్టి దోపిడీని అధికారులు అడ్డుకోకపోతే ఇరిగేషన్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని గ్రామస్థులు, రైతులు హెచ్చరిస్తున్నారు.


మణూరు చెరువులో మట్టి తవ్వి, తరలిస్తున్న దృశ్యం

అధికారుల వత్తాసు



చెరువు మట్టిని రైతులు పొలాలకు తరలిస్తే వెంటనే సంబంధిత అధికారులు స్పందిస్తారు. అనుమతులు లేవంటూ అడ్డుకుంటారు. అధికార పార్టీ నాయకులు తరలిస్తే మాత్రం ఆవైపు కన్నెత్తి చూడరు. గ్రామస్థులు సమాచారం అందించినా.. పట్టించుకోవడం లేదు. దీనిని బట్టి చూస్తే అధికార పార్టీ నాయకులకు అధికారులు వత్తాసు పలుకుతున్నారని స్పష్టమవుతోంది.

- గోవిందప్ప, మాజీ సర్పంచ్

చర్యలు తప్పవు

అనుమతులు లేకుండా చెరువుల్లో మట్టిని తరలిస్తే చర్యలు తీసుకుంటాం. ఎవ్వరినీ ఉపేక్షించేది లేదు.

- భార్గవ్, ఇరిగేషన్ ఏఈ, మడకశిర

డైట్ ప్రిన్సిపాల్‌గా రవిసాగర్



బుక్కపట్నం, ఫిబ్రవరి 26: జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్) కళాశాల ప్రిన్సిపాల్‌గా సోమవారం రవిసాగర్ బాధ్యతలు స్వీకరించారు. ఏలూరు జిల్లా ఉప విద్యాశాఖాధికారిగా, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ట్రైనీ డీఈఓగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న ఈయన ఉద్యోగోన్నతిపై బుక్కపట్నం డైట్ ప్రిన్సిపల్‌గా నియమితుడయ్యారు.

రైల్వేస్టేషన్లకు మహర్దశ

పురం, ధర్మవరం స్టేషన్ల ఆధునికీకరణకు వర్చువల్‌గా ప్రధాని మోదీ శ్రీకారం

హిందూపురం అర్బన్/ధర్మవరం, ఫిబ్రవరి 26: జిల్లాలోని హిందూపురం, ధర్మవరం రైల్వేస్టేషన్లకు మహర్దశ పట్టనుంది. అమృత్ భారత్ పథకం కింద ఇరు స్టేషన్ల ఆధునికీకరణకు వర్చువల్‌గా ప్రధాని నరేంద్రమోదీ సోమవారం శంకుస్థాపన చేశారు. రైల్వేస్టేషన్ల ఆవరణాల్లో రైల్వే అధికారులు ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. రైల్వే అధికారులు, పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు. ధర్మవరం రైల్వేస్టేషన్ ఆధునికీకరణకు రూ.7.14 కోట్లు, హిందూపురానికి రూ.15 కోట్లు కేటాయించారు. ధర్మవరం రైల్వేస్టేషన్‌లో భవనంతోపాటు స్టేషన్ ఎంట్రెన్స్‌ను అభివృద్ధి చేయడం, వెయిటింగ్ హాళ్లను మెరుగుపరచడం, ప్రయాణీకులకు అనుకూలమైన సంకేతాలను అందించడం వంటి వాటితోపాటు దీర్ఘకాలిక మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించనున్నారు. పురం రైల్వేస్టేషన్‌లో ఎక్సలేటర్, లిఫ్ట్ సౌకర్యం కల్పించనున్నారు. కార్యక్రమాల్లో రైల్వే అధికారులు, సిబ్బంది, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రశ్నపత్రాల తరలింపు

కొత్తచెరువు, ఫిబ్రవరి 26: జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రశ్నపత్రాలను ఆయా పరీక్ష కేంద్రాలను సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పంపిణీ చేశారు. ఇంటర్ విద్య ఆర్జేడీ రవీంద్ర ఆధ్వర్యంలో వాటిని సంబంధిత పోలీసు స్టేషన్లకు తరలించారు. మార్చి 1వ తేదీన పరీక్షలు ప్రారంభంకానున్న నేపథ్యంలో ప్రశ్నపత్రాలు తరలించినట్లు ఆర్జేడీ తెలిపారు. పరీక్షలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన వివరించారు.

బరితెగింపు..!

సరిహద్దులో చెలరేగుతున్న మద్యం మాఫియా



కర్ణాటక వారికి వైసీపీ అండ
ఉదాసీనంగా ఉన్నతాధికారులు
కిందిస్థాయి సిబ్బందిపై దాడులు
తూతూమంత్రంగా కేసుల నమోదు
క్షేత్రస్థాయిలో విధులకు జంకుతున్న వైనం

హిందూపురం


కర్ణాటక సరిహద్దులో మద్యం మాఫియా చెలరేగిపోతోంది. కర్ణాటక నుంచి ఆ ప్రాంత వ్యాపారులు మాఫియాగా ఏర్పడి జిల్లాలోకి యథేచ్ఛగా మద్యం సరఫరా చేస్తున్నారు. వారికి వైసీపీ నాయకుల అండ పుష్కలంగా ఉందన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ఏపీలో అందుబాటులో ఉన్న మద్యం నాసిరకందన్న విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. దీంతో కర్ణాటక మద్యంపై ఈ ప్రాంతవాసులు మక్కువ చూపుతున్నారు. ఇటీవలి వరకు కర్ణాటకకు వెళ్లి మద్యం సేవించి వచ్చేవారు. ఆ తరువాత సంబంధిత శాఖాధికారులు చేతులెత్తేయడంతో ఇక్కడికే తీసుకొచ్చి, అధికార పార్టీ నాయకుల అండతో విక్రయించడం మొదలెట్టారు. కొన్ని నెలలుగా హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజకవర్గాల పరిధిలోని పల్లెలకు కర్ణాటకకు చెందిన మద్యం షాపుల యజమానులే మాఫియాగా తయారై డోర్ డెలివరీ చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల పట్టుబడిన వారిలో కర్ణాటక ప్రాంతానికి చెందినవారే ఉంటుండడమే ఇందుకు నిదర్శనం.



పేట్రేగిపోతున్నారు..

కర్ణాటక సరిహద్దులోని మధుగిరి ప్రాంతం, గౌరీబిదునూరు, బాగేపల్లి, చేలూరు, ప్రాంతాల్లో మద్యం షాపులు నిర్వహించే యజమానులు కొంత మంది మాఫియాగా ఏర్పడ్డారు. రాత్రింబవళ్లు జిల్లాకు మద్యం సరఫరా చేస్తున్నారు. కర్ణాటకలో షాపువద్ద కొనుగోలు చేస్తే ఒక ధర, సరిహద్దు దాటిస్తే మరోధర, డోర్ డెలివరీ చేస్తే ఇంకో ధర నిర్ణయించారు. ఆ మేరకు దిగుమతి చేస్తున్నట్లు సమాచారం. ఈ సందర్భంలో ఆంధ్ర పోలీసులకు పట్టుబడితే వారిని మొదట సర్దుకుపోయేలా ప్రయత్నిస్తారు. వినకుంటే తిరగబడతారు. ఏడాదిన్నర క్రితం కర్ణాటక నుంచి హిందూపురానికి మద్యం సరఫరా చేస్తున్నట్లు సమాచారంతో సిబ్బంది సరిహద్దులో కాపుకాశారు. వారు వాహనంలో మద్యం తీసుకొస్తున్నారు. అడ్డగించి వివరాలు తెలుసుకుంటుండగా మద్యం తీసుకెళ్తున్న కర్ణాటక ప్రాంతంవారు సెబ్ ఎస్ఐపైనే దాడికి యత్నించారు. ఇందులో కొసమెరుపేంటంటే కర్ణాటక సరిహద్దు దాటించడానికి మద్యం వెంట ఆ రాష్ట్రానికి చెందిన ఓ కానిస్టేబుల్ వచ్చి, అతడు కూడా ఎస్ఐపై తిరగబడటం కలకలం రేపింది. ఇదే ఎస్ఐ ఏడాదిన్నర క్రితం కర్ణాటక మద్యం హిందూపురానికి డోర్‌డెలివరీ చేస్తున్నారన్న సమాచారంతో పట్టణంలోని రెండో పోలీసు స్టేషన్ పరిధిలో తనిఖీలకు వెళ్లగా.. సెబ్ అధికారులపైనే తిరగబడ్డారు. ఏడాదిక్రితం లేపాక్షి మండల పరిధిలో కర్ణాటక నుంచి మద్యం తీసుకొస్తున్న సమాచారం అందుకుని, పట్టుకోవడానికి వెళ్లగా ఓ కానిస్టేబుల్‌ను కర్ణాటకకు చెందిన వారితోపాటు ఈ ప్రాంతానికి చెందిన వైసీపీ నాయకులు వెంటబడి దాడికి ప్రయత్నించారు. వారి దాడి నుంచి కానిస్టేబుల్ తప్పించుకోగలిగాడు. ఆరునెలల క్రితం చిలమత్తూరు మండలం కొడికొండ చెక్‌పోస్టు సమీపం నుంచి భారీఎత్తున మద్యం తరలి వెళ్తుండగా సమాచారం అందుకున్న పోలీసులు వాహనాన్ని తనిఖీ చేయడానికి ప్రయత్నించగా.. వారిపైనే తిరగబడ్డారు. ఇది రాత్రివేళ జరగడం, అందులో చిలమత్తూరుకు చెందిన వైసీపీ యువ నాయకుడి హస్తం ఉండటంతో అప్పట్లో సద్దుమణిగించారు. సదరు వైసీపీ యువనాయకుడు కర్ణాటక నుంచి నిత్యం మద్యం సరఫరా చేస్తునే ఉన్నాడన్న చర్చ సాగుతోంది. ఐదేళ్ల క్రితం సదరు వైసీపీ యువ నాయకుడు కొనుగోలు చేసిన వాహనానికి ఈఎంఐ కట్టే పరిస్థితి లేక ఫైనాన్సర్‌కే వదిలేశాడు. ప్రస్తుతం లక్షల నుంచి కోట్ల రూపాయలు గడిస్తున్నట్లు సమాచారం. రెండు నెలల క్రితం ఇదే మండలంలోని సోమగట్ట ప్రాంతంలో రాత్రి 10 గంటల సమయంలో సెబ్ అధికారులు వాహన తనిఖీలు చేస్తుండగా పెద్దఎత్తున మద్యం పట్టుబడింది. ఈ మద్యాన్ని కర్ణాటకలోని బాగేపల్లి ప్రాంతానికి చెందిన వైన్‌షాపు యజమాని గోరంట్ల ప్రాంతానికి తరలిస్తున్నట్లు అప్పట్లో అధికారులు కేసు నమోదు చేశారు. అప్పట్లో కూడా పోలీసులపై కర్ణాటకకు చెందిన మాఫియా దాడికి యత్నించింది. తాజాగా ఈనెల 24వ తేదీన రాత్రి పరిగి మండలం శ్రీరంగరాజులపల్లి వద్ద సెబ్ హెడ్‌కానిస్టేబుల్‌తోపాటు వాహన డ్రైవర్‌పై మద్యం మాఫియా దాడిచేసిన విషయం విదితమే. చిన్న చిన్న గొడవలు కోకొల్లలు.

మాఫియాకు వైసీపీ అండ



ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ అనుచర గణాన్ని దారికి తెచ్చుకునేందుకు అధికార పార్టీ నాయకులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. కర్ణాటక నుంచి డోర్ డెలివరీ చేసే మద్యం మాఫియాకు వైసీపీ నాయకుల అండ పుష్కలంగా ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందుకు కారణాలు లేకపోలేదు. రాత్రిపూట కర్ణాటక మద్యాన్ని పట్టుకుంటే ఆగమేఘాలపై ప్రస్తుత సమన్వయకర్త వద్ద ఉన్న ఓ నాయకుడు వెళ్లి విడిపించాడు. ఇలాంటి ఘటనలు చాలానే ఉన్నాయి. మద్యం మాఫియాకు అధికార పార్టీ నాయకుల అండ ఎంత మాత్రం ఉందో దీనిని బట్టే అర్థం చేసుకోవచ్చు. కిందిస్థాయి సిబ్బందిపై దాడులు చేసినపుడు పైఅధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో ఇలాంటివి సర్వసాధారణమయ్యాయి. ఈ కారణంగా క్షేత్రస్థాయిలో మద్యం మాఫియాను అడ్డుకోవడానికి జంకుతున్నారు. అంతేకాక వారిపై నామమాత్రపు కేసులు నమోదు చేస్తుండడంతో క్షేత్రస్థాయిలో తనిఖీలకు వెళ్లే సిబ్బంది మనోధైర్యం కోల్పోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, క్షేత్రస్థాయిలో తనిఖీలకు వెళ్లే సిబ్బందికి అండగా నిలబడి, మద్యం మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జగన్‌ను సాగనంపుదాం

- అనంత అంటే కాంగ్రెస్‌కు ఎంతో ఇష్టం
- ఏపీలో బలమైన నాయకుడు వైఎస్సార్
- ఆయన ఆశయ సాధన షర్మిలతోనే సాధ్యం
- ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే
- అనంతలో కాంగ్రెస్ 'న్యాయ సాధన సభ'



ఐక్యత చాటుతున్న కాంగ్రెస్, వామపక్ష నాయకులు



మాట్లాడుతున్న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 26: మాట తప్పి, మడమ తిప్పిన సీఎం జగన్‌ను ఇంటికి సాగనంపుదామని, కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెద్దామని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రజలకు పిలుపునిచ్చారు. అనంతపురం నగరంలోని న్యూటౌన్ జూనియర్ కళాశాల మైదానంలో పీసీసీ మాజీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన 'న్యాయ సాధన సభ'లో ఆయన ప్రసంగించారు. అంతకు మునుపు పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలతో కలిసి 'ప్రతి నెలా ప్రతి కుటుంబానికి రూ.5 వేలు' లోగోను ఆవిష్కరించారు. అనంతపురం అంటే ఇందిరా గాంధీ సహా కాంగ్రెస్ కీలక నాయకులందరికీ మహా ఇష్టమని, ఇక్కడి నుంచి ఇద్దరు ప్రధానులను, వైఎస్సార్ లాంటి బలమైన నాయకుడిని ఇచ్చారని అన్నారు. రాష్ట్ర హక్కుల కోసం ప్రధానులను వైఎస్సార్ నేరుగా కలిసేవారని, మోదీ ప్రధాని అయిన తరువాత చంద్రబాబు, జగన్ అలా ఎన్నిసార్లు కలిశారని ప్రశ్నించారు. స్వప్రయోజనాల కోసం అడపాదడపా కలిసింది తప్ప.. రాష్ట్రం కోసం ఒక్కసారీ కలిసింది లేదని విమర్శించారు. రాష్ట్ర హక్కుల గురించి గొంతు విప్పి చెప్పుకోలేని పరిస్థితుల్లో ఆ రెండు పార్టీలు ఉన్నాయని విమర్శించారు. బీజేపీ అంటే బాబు, జగన్, పవన్ అని.. వీరిలో ఏ ఒక్కరికి ఓటు వేసినా అది బీజేపీ ఖాతాలోకే చేరుతుందని అన్నారు. అందుకే ఇండియా కూటమిని బలపరచాలని కోరారు. వైఎస్సార్ ఆశయ సాధన షర్మిలతోనే సాధ్యమని, ఆయన వారసురాలిగా షర్మిల రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపేందుకు కాంగ్రెస్‌లోకి వచ్చారని అన్నారు. స్థానిక నాయకులు ఆమెకు సహకారం అందించాలని కోరారు. పదేళ్లుగా రాష్ట్రంలో అభివృద్ధి లేదని, పరిశ్రమలు, ఉద్యోగాలు లేవని అన్నారు. ఐదేళ్లు చంద్రబాబు, మరో ఐదేళ్లు జగన్ రాష్ట్రాన్ని నాశనం చేశారని విమర్శించారు.

నాశనం చేసేశారు..



ప్రధాని మోదీ, సీఎం జగన్ దేశాన్ని, రాష్ట్రాన్ని నాశనం చేశారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మండిపడ్డారు. నియంతను తలపించేలా పోలీసుల రాజ్యం నడిపిస్తున్నారని విమర్శించారు. వారు ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని సవాలు విసిరారు. దేశాన్ని రూ.156 లక్షల కోట్ల అప్పుల్లోకి నెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మతాలు, కులాల మధ్య చిచ్చుపెడుతున్నారని అన్నారు. రైతులు ఢిల్లీకొస్తే రోడ్లల్లో మేకులు పెడతారా..? రైతులను కాల్చి చంపుతారా..? బీజేపీ రైతు వ్యతిరేక ప్రభుత్వం..' అని విమర్శించారు. అంబానీ, ఆదానీ ఆస్తులను పెంచుతూ ఊడిగం చేస్తూ.. మూడోసారి అధికారం కావాలని అడుగుతున్నారని చేస్తున్నారని మండిపడ్డారు.

-సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ఐదేళ్లు నిద్రపోయారా..?



అధికారంలోకి వస్తే ఏటా మెగా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్ అన్నారని, ఐదేళ్లు కుంభకర్ణుడిలా నిద్రపోయి, ఎన్నికల సమయంలో దగా డీఎస్సీని విడుదల చేశారని సీఎం జగన్‌పై షర్మిల మండిపడ్డారు. మెగా డీఎస్సీ విడుదల చేయాలని వైఎస్సార్ వారసురాలిగా పోరాటానికి దిగిన తనను అరెస్టు చేసి ఈడ్చుకెళతారా అని నిలదీశారు. సాగునీటి ప్రాజెక్టులు, మద్యపాన నిషేధం వంటి హామీల విషయంలో మాట తప్పిన మీరా వైఎస్సార్ వారసులు అని జగన్‌ను ప్రశ్నించారు. చెల్లెలు అన్న కనీస మర్యాద లేకుండా జగన్ అండ్ టీం తనను దూషిస్తోందని అన్నారు. '3,200 కి.మీ. పాదయాత్ర చేసి వైసీపీని నిలబెట్టింది ఎవరు..? బాబును అధికారంనుంచి దించింది ఎవరు? నేను కాదా?' అని ప్రశ్నించారు. ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు సహా రాష్ట్ర హక్కులను సాధించుకునే వరకూ ఇక్కడే ఉంటానని, పోరాటం చేస్తానని ఆమె అన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లని వైఎస్సార్ చెప్పిన మాటను గుర్తు చేశారు. కాంగ్రెస్ చెప్పిన మాట నిలుపుకునే పార్టీ అని, ఇందిరమ్మ రాజ్యం రావాలి... ఇంటింటికి రూ.5 వేలు అందాలంటే కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఇదిరమ్మ అభయ హస్తం కింద ప్రతి మహిళకు ఏడాదికి రూ.60 వేలు అందిస్తామని అన్నారు.

- పీసీసీ అధ్యక్షురాలు షర్మిల


సోనియా చలించిపోయారు..



'2004 ఎన్నికలకు ముందు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాదయాత్ర అనంతరం అప్పటి ఏఐసీసీ అధ్యక్షురాలు సోనియాగాంధీని ఇక్కడికి పిలిపించాం. అప్పటి కరువు పరిస్థితులను చూసి ఆమె చలించిపోయారు. వలసలను అరికడతామని మర్తాడులో హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టారు..' అని సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి అన్నారు. ఏడు లక్షల మంది వలస వెళతారని, వారిని ఆపడం సాధ్యమా అని అప్పట్లో తానే సందేహించానని అన్నారు. ప్రధాని పదవిని సైతం త్యాగం చేసి, మన్మోహన్‌సింగ్‌ను ప్రధానిని చేసి, ఆయన ద్వారా ఉపాధిహామీ పథకాన్ని తెచ్చారని గుర్తు చేశారు. బండ్లపల్లిలో మొదలైన ఈ పథకం.. నేటికీ కొనసాగుతోందని అన్నారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితులే ఉన్నాయని, అందుకే ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేని పిలిపించి వాగ్దానం చేయించామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ అధికారంలోకి వచ్చిన వెంటనే మరోసారి ఇక్కడికి పిలిపించి, ప్రతి కుటుంబానికి రూ.5 వేలు పథకం అమలుకు శ్రీకారం చుడతామని అన్నారు.

- రఘువీరారెడ్డి, సీడబ్ల్యూసీ సభ్యుడు

ఇండియా కూటమిని బలపర్చాలి...



బీజేపీని వ్యతిరేకించే పార్టీలన్నీ ఇండియా కూటమిని బలపరచాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ రావు పిలుపునిచ్చారు. బీజేపీని వ్యతిరేకించే పార్టీలన్నీ ఒక్కొక్కటిగా ఇండియా కూటమిలో చేరుతున్నాయని, బలాన్ని పెంచుతున్నాయని అన్నారు. ఇండియా కూటమి బలంగా ఉంటేనే దేశం బాగుపడుతుందని అన్నారు. బీజేపీని గద్దె దింపాలంటే ఇండియా కూటమిని మద్దతు తెలపాలని కోరారు.

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

మెప్మా ఆర్పీలతో నీకేంపని ?

- మెట్టుకు కాలవ ప్రశ్న



ఆర్పీలతో సమావేశం నిర్వహిస్తున్న మెట్టు

రాయదుర్గం, ఫిబ్రవరి 26: వైసీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి సోమవారం అతడి ఇంటి వద్ద మెప్మా ఆర్పీలతో సమావేశం నిర్వహించడాన్ని టీడీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కాలవ శ్రీనివాసులు తప్పుపట్టారు. ఏ హోదాతో మెట్టు ఆర్పీలను తన ఇంటికి పిలిపించుకుంటారని ఒక ప్రకటనలో ఆయన ప్రశ్నించారు. రాయదుర్గం పట్టణంలో మెప్మా విభాగం లో సేవలందిస్తున్న ఆర్పీలను బలవంతంగా మెట్టు ఇంటికి పిలిపించుకున్నారని ఆరోపించారు. అతడికి పార్టీ పదవి తప్ప ప్రభుత్వంలో ఎలాంటి అధికారిక హోదా లేదన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఇలాం టి సమావేశాలు నిర్వహించడం అధికార దుర్వినియోగమే అవుతుందన్నారు. దీన్ని తాము ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళతామన్నారు.

వడదెబ్బ తగిలి వ్యక్తి మృతి

కళ్యాణదుర్గంరూరల్, ఫిబ్రవరి 26: వడదెబ్బ తగిలి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం బ్రహ్మసముద్రం మండలం కన్నేపల్లిలో జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు సన్న లింగప్ప (55)గ్రామ సమీపంలో ఉన్న కప్పలకుంట చెరువులో కట్టెలు కొడుతుండగా తీవ్రమైన ఎండకు కుప్పకూలిపోయాడు. ఆయన కుమారుడు మాంతేష్ తన తండ్రిని ఇంటికి పిలుచుకురావడానికి వెళ్లాడు. అప్పటికే చేతులు, కాళ్ల మీద బొబ్బలు వచ్చి అపస్మారక స్థితిలో పడి ఉన్న లింగప్పను గుర్తించాడు. వెంటనే ఆటోలో బ్రహ్మసముద్రం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య కొల్లక్క, కుమారుడు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. బ్రహ్మసముద్రం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని యువకుడి దుర్మరణం

- మరొకరికి తీవ్ర గాయాలు



శివానంద(ఫైల్)

పామిడి, ఫిబ్రవరి 26: దేవర సంబరంతో సందడిలో ఉన్న ఆ కుటుంబం ఒక్కసారిగా శకసంద్రంలో మునిగిపోయింది. కూరగాయలు తెచ్చేందుకు వెళ్లిన ఆ ఇంట్లోని యువకుడిని కారు రూపంలో మృత్యువు కబళించింది. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... కూరగాయలు తీసుకొని ద్విచక్ర వాహనంలో వరుసకు సోదరులైన తలారి శివానంద(20), సురేష్ ఇంటికి తిరిగి వస్తుండగా కారు ఢీ కొనడంతో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడిన సంఘటన గజరాంపల్లిలో సోమవారం చోటుచేసుకుంది. మండలంలోని నీలూరు గ్రామానికి చెందిన తిరుపాలు ఇంట్లో మంగళవారం దేవర కార్యక్రమం ఉంది. ఇందుకు అవసరమైన కూరగాయలు తీసుకువచ్చేందుకు తిరుపాలు కుమారుడు సురేష్ వరుసకు సోదరుడైన జీ కొట్టాలకు చెందిన తలారి శివానందతో కలిసి గుత్తికి వెళ్లారు. కూరగాయలు తీసుకొని ద్విచక్ర వాహనంపై నీలూరుకు బయలుదేరారు. మండలంలోని గజరాంపల్లి గ్రామ సమీపాన ఉన్న ఓ పాల్ డైరీ వద్దకు రాగానే కర్నూలు నుంచి అనంతపురం వెళ్తున్న కారు వెనుక నుంచి ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ సంఘటనలో శివానంద, సురేష్ తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే 108 వాహనంలో క్షతగాత్రులను హుటాహుటిన పామిడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే శివానంద అప్పటికే మృతి చెందినట్లు ఆరోగ్య సిబ్బంది తెలిపారు. ప్రథమ చికిత్స అనంతరం క్షతగాత్రుడు సురేష్‌ను మెరుగైన చికిత్సకు అనంతపురం తరలించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకటశివుడుయాదవ్ మృతదేహానికి నివాళులర్పించి తండ్రి బసయ్యను ఓదార్చారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు పెద్ద ఎత్తున ఆసుపత్రికి చేరుకొని రోదించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది. కారు డ్రైవర్ నిర్లక్ష్యం వల్లనే రోడ్డు ప్రమాదం చోటుచేసుకుందని పోలీసులు తెలిపారు. మృతుడికి తల్లిదండ్రులు నాగరత్న, బసయ్య ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఢీకొట్టి ఉడాయించి.. దబాయింపు: మండలంలోని గజరాంపల్లి వద్ద 44వ జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ ప్రమాదం జరగగానే కారుతో ఉడాయించాడు. ఆ కారు వెనుకనే హైదరాబాదు నుంచి బెంగళూరుకు వెళ్తున్న మరో కారులోని ప్రయాణికులు ఈ ఘటనను గమనించారు. వారు అప్రమత్తమై ఎలాగైనా పట్టుకోవాలని ఆ కారును వెంబడించారు. ఆ కారును నిలిపేందుకు ప్రయత్నించిన వారినే నిందితుడు దబాయించాడు. దీంతో పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం చేరవేసి పోలీసుల సహకారంతో ప్రమాదానికి కారణమైన నిందితున్ని అదుపులోకి తీసుకొని పామిడి పోలీసులకు అప్పగించినట్లు సమాచారం.



ఆస్పత్రి వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

పంటలకు కనీస మద్దతు ధరల చట్టం చేయాలి

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 26: రైతులు పండించిన పంటలకు కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతుధరల చట్టం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు డిమాండ్ చేశారు. భారత రైతులకు, కార్మికులకు నష్టదాయకంగా ఉన్న డబ్ల్యూటీఓ ఒప్పందాలను వ్యతిరేకిస్తూ సోమవారం సీఐటీయూ, ఏఐటీయూసీ, రైతు సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలో గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఓబులు మాట్లాడుతూ... రైతులు పండించే పంటలకు స్వామినాథన్ సిఫారసుల ప్రకారం కనీస మద్దతుధరల చట్టం చేయాలన్నారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2021లో మూడు వ్యవసాయ నల్లచట్టాలకు వ్యతిరేకంగా జరిగిన చారిత్రాత్మక రైతు ఉద్యమం సందర్భంగా రైతాంగానికి ప్రధాని నరేంద్రమోదీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ మరోసారి పంజాబ్, హర్యానా, ఉత్తర ప్రదేశ్ రైతులు ఈనెల 13 నుంచి ఢిల్లీలో ఉద్యమం చేపట్టారన్నారు. అయితే రైతుల డిమాండ్లపై సానుకూలంగా స్పందించి, చర్చించి పరిష్కరించేదిశగా కాకుండా వారిని ఢిల్లీకి చేరుకోకుండా బీజేపీ నేతృత్వంలో రోడ్లపై ఇనుప మేకులు కొట్టి, భారీ సిమెంటు దిమ్మెలతో బారికేడ్లు ఏర్పాటు చేశారన్నారు. ఢిల్లీవైపు వస్తున్న రైతులను అడుకునేందుకు శత్రుదేశ సైనికులపై చేసినట్లు భారత రైతాంగంపై కేంద్ర ప్రభుత్వం యుద్ధ ప్రకటించిందని మండిపడ్డారు. పంజాబ్‌కు చెందిన యువరైతు శుభ్‌కరణ్ సింగ్ ఈ దాడుల్లో మరణించాడని, 25 మందికి పైగా గాయపడ్డారన్నారు. ఇప్పటికే ముగ్గురు రైతులు గుండెపోటుతో మరణించగా అనేకమంది తీవ్ర గాయాలతో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారన్నారు. రైతులపై బీజేపీ చేస్తున్న దుర్మార్గపు దాడిని ఖండిస్తూ, పంటలకు మద్దతు ధరలు అమలు చేయవద్దని భారత ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్న డబ్ల్యూటీఓ సమావేశాలను బహిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్ర ధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి, రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేకర్‌రెడ్డి, వెంకటనారాయణ, ముత్తుజ, రాజేష్‌గౌడ్, కృష్ణుడు, శ్రీనివాసు లు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం, ఏటీఎం నాగరాజు, లక్ష్మీనారాయణ, ఆదినారాయణ పాల్గొన్నారు.



గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

జడ్పీ డిప్యూటీ సీఈఓపై విచారణ...!

- జీతం, అలవెన్సులు డ్రా చేయడంపై ఫిర్యాదులు
- విచారించాలని కలెక్టర్‌కు పీఆర్ కమిషనర్ ఆదేశం

అనంతపురం విద్య, ఫిబ్రవరి 26: జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ లలితా బాయిపై విచారణకు కలెక్టర్ ఆదేశించారు. గత ఏడాది జూన్, జులై నెలల్లో నిబంధనలకు విరుద్ధంగా జీతం, ఇతర అలవెన్సులు డ్రా చేయడంపై పంచాయతీ రాజ్ కమిషనర్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో ఆమెపై విచారణ చేయాలంటూ...జిల్లా కలెక్టర్‌కు పీఆర్ కమిషనర్ సూర్యకుమారి ఆదేశాలు జారీ చేశారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత ఏడాది జడ్పీకి డిప్యూటీ సీఈఓగా లలితాబాయిని నియమించారు. అయితే ఆమె చేరికపై అప్పట్లో పెద్ద నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. తనను చేర్చుకోలేదంటూ.. ఆమె అప్పట్లో పలుమార్లు పీఆర్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో అనూహ్యంగా అప్పట్లో డిప్యూటీ సీఈఓగా అమృత్‌రాజ్‌ను పనిచేస్తున్న మరో అధికారిని సస్పెండ్ చేశారు. దీంతో ఆయన కోర్టును ఆశ్రయించడంతో...వెంటనే ఆయనపై ఉన్న సస్పెన్షన్ ఎత్తివేశారు. ఈ క్రమంలో డిప్యూటీ సీఈఓగా ఉన్న అధికారి రిలీవ్ కాకుండానే... కొత్తగా వచ్చిన లలితా బాయి విధుల్లో చేరడం, బాధ్యతలు తీసుకోవడంపై పెద్ద దుమారం రేగింది. ఆమె విధుల్లో జూన్ 10న చేరారని, 2023 జూన్, జులై నెలల్లో జీతం, ఇతర అలవెన్సులు డ్రా చేయడంపై అనేక విమర్శలు వచ్చాయి. విధుల్లో చేరిన తేదీలు, జీతాలు, ఇతర అలవెన్సులు డ్రా చేసిన వాటికి పొంతన లేకపోవడంపై అనేక ఆరోపణలూ వచ్చాయి. అయితే ఆమె అధికార దుర్వినియోగానికి పాల్పడి జీతాలు, అలవెన్సులు డ్రా చేశారంటూ... తాజాగా ఇటీవల కర్నూలు జిల్లాకు చెందిన రమేష్ అనే వ్యక్తి పూర్తిస్థాయి సాక్ష్యాధారాలతో పంచాయతీ రాజ్ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆమెపై వి చారణ చేయాలంటూ.. ఆ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారు.



డిప్యూటీ సీఈఓ లలితా బాయి(ఫైల్)

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో 37 మందికి గాయాలు

- బొలెరో బోల్తా పడి 30 మంది కూలీలు
- ఆటో బోల్తా... ఏడుగురు ఉపాధ్యాయినులు

ఉరవకొండ, ఫిబ్రవరి 26: ఉరవకొండ, విడపనకల్లు మండలాల్లో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 37 మంది గాయపడ్డారు. ఉరవకొండ పట్టణ శివారులోని గుంతకల్లు రహదారిలో కూలీలతో వెళ్తున్న బొలెరో వాహనం టైర్ పంక్చర్ కావడంతో వాహనం అదుపు తప్పి బోల్తా పడిన ప్రమాదంలో 30 మంది కూలీలు గాయపడ్డారు. వజ్రకరూరుకు చెందిన 45 మంది కూలీలు విడపనకల్లు మండలంలోని పాల్తూరుకు మిరప పంటను కోసేందుకు బొలెరో వాహనంలో బయలు దేరారు. ఉరవకొండ సమీపంలోకి వాహనం రాగానే, టైర్ పంక్చర్ కావడంతో వాహనం అదుపు తప్పి బోల్తా పడింది.ఈ ప్రమాదంలో 30 మంది గాయపడ్డారు. గాయపడిన



ప్రమాదంలో గాయపడిన కూలీలు

వారంతా వాహనాల కోసం రోడ్డుపైనే ఎదురు చూశారు. 108 వాహనానికి ఫోన్ చేసి గంట అయినా రాలేదని క్షతగ్రాతులు ఆవేదన వ్యక్తం చేశారు. గాయపడిన కూలీలను స్థానికులు ప్రైవేట్ వాహనాల్లో ఉరవకొండ ఆసుపత్రికి తరలించారు. సీఐ తిమ్మయ్య యాదవ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. గాయపడిన వారిలో జ్యోతి, మరియమ్మ, సునీత, కృప, భాగ్యమ్మకు తీవ్ర గాయాలు అయ్యాయి. వీరి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ వన్నూరుస్వామితో పాటు మరో 25మంది స్థానిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే

రోడ్డు ప్రమాద సంఘటనకు సంబంధించిన వివరాలను ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్, టీడీపీ నాయకులు అడిగి తెలుసుకున్నారు. అనంతపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే డాక్టర్లను కోరారు. వజ్రకరూరు టీడీపీ నాయకులు నూతేటి వెంకటేశులు, దస్తగిరి, ఛాయాపురం నాగభూషణ గాయపడిన వారిని పరామర్శించారు. దగ్గరుండి వారికి అవసరమైన ఏర్పాట్లను చేశారు.



ఉరవకొండ వద్ద బోల్తాపడిన బొలెరో వాహనం

కూలీలంతా సేఫ్..

అనంతపురం టౌన్: పాల్తూరు వద్ద ప్రమాదానికి గురై చికిత్స కోసం జిల్లా ఆస్పత్రికి వచ్చిన కూలీలందరూ ఆరోగ్యంగా ఉన్నారని ఆర్ఎంఓ హేమలత తెలిపారు. మొత్తం 18మంది కూలీలను మెరుగైన చికిత్సకోసం జిల్లా ఆస్పత్రికి తెచ్చారన్నారు. వీరిలో ఇద్దరకికాళ్లు విరిగాయని మిగిలినవారిలో చిన్నచిన్న గాయాలు అయ్యాయని ఎవరికీ ప్రాణాపాయం లేదన్నారు.

ఆటో బోల్తా పడి..

విడపనకల్లు: మండలంలోని ఉండబండ గ్రామం వద్ద ఆటో బోల్తా పడి ఏడుగురు ఉపాధ్యాయినులు గాయపడిన సంఘటన సోమవారం ఉదయం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే.. పాల్తూరు గ్రామంలోని ఇందిరా నగర్ కాలనీలో ఉన్న ఎంపీపీ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఏడుగురు ఉపాధ్యాయినులు ఉరవకొండ నుంచి పాల్తూరుకు ఆటోలో ఉదయం బయలు దేరారు. ఉండబండ కాలువ వద్ద ఆటో రాడ్ కట్ కావటంతో పల్టీకొట్టింది. ఇందులోని ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మరో ఐదుగురు స్వల్పంగా గాయపడ్డారు. గాయపడిన ఇద్దరిని అనంతపురం ఆసుపత్రికి తరలించారు. ఆటో బోల్తా పడిన వెంటనే పొలాల్లో పనులు చేస్తున్న గ్రామస్థులు అక్కడికి చేరుకుని ఆటోలో ఇరుక్కున్న వారిని బయటకు తీసి ఉరవకొండకు తరలించారు. గాయ పడిన వారిలో సి. రాధ, ఎ. శైలజ, ఎల్. కవిత, ఎస్. ఈశ్వరి, ఎస్. గౌతమి, హేమలతమ్మ, లక్ష్మీకళ ఉన్నారు.



ఉండబండ వద్ద బోల్తా పడిన ఆటో

నేడు వైద్య ఉద్యోగులకు ప్రత్యేక స్పందన

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 26: ఆరోగ్యశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు వైద్య ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కోసం మంగళవారం ప్రత్యేక స్పందన ఏర్పాటు చేసినట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖలో పనిచేసే ఉద్యోగులలో జీతాలు సమస్యలు ఉన్నా వ్యక్తిగతంగా ఏమైనా ఇబ్బందులు, సమస్యలు ఉన్నా నేరుగా కలిసి వినతి రూపంలో తెలపవచ్చన్నారు. ఇక్కడ అందిన వినతులను రాష్ట్రశాఖకు పంపుతామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ఆత్మహత్యకు కారకులైన ఇద్దరికి జైలు శిక్ష

అనంతపురం క్రైం,ఫిబ్రవరి 26: ఒకరి ఆత్మహత్యకు కారకులైన ఇద్దరికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.10వేల జరిమానా పడింది. గార్లదిన్నె మండలం పెనకచెర్ల గ్రామానికి చెందిన కొత్తపల్లి కృష్ణారెడ్డి, కొత్తపల్లి చలమావతిలకు మూడేళ్ల జైలు శిక్ష, చెరో రూ.10వేలు జరిమానా విధిస్తూ ఇదివరకే అనంతపురం పీఏఎస్‌జే కోర్టు న్యాయాధికారి వెలువరించిన తీర్పును జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్ సోమవారం ఖరారు చేశారు. పెనకచెర్ల గ్రామానికి చెందిన పి.ఉమాదేవి, ఆమె భర్త రవిశంకర్‌లు కొత్తపల్లి కృష్ణారెడ్డి, మరికొందరితో మాట్లాడి తమకున్న ఇంటిని రూ.2.70లక్షలకు రిజిస్టర్ ఆయకం చేయించారు. ఈ విషయంలో రవిశంకర్ ఇల్లును విడిపించుకోమని కొత్తపల్లి కృష్ణారెడ్డితో పాటు మిగితా ఈ కేసులోని నిందితులు రవిశంకర్‌పై బలవంతం చేశారు. దీంతో రవిశంకర్ పురుగుల మందు తాగి మృతిచెందాడు. ఈ ఘటనపై 2015 డిసెంబరు 22న గార్లదిన్నె పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసును సమగ్రంగా విచారించిన అనంతపురం పీఏఎస్‌జే కోర్టు న్యాయాధికారి ఇదివరకే ఇద్దరికి మూడేళ్ల జైలు శిక్ష, చెరో రూ.10వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. దీనిపై జిల్లా కోర్టుకు అప్పీలుకు వెళ్లగా సమగ్రంగా విచారించిన జిల్లా న్యాయాధికారి పీఏఎస్‌జే కోర్టు న్యాయాధికారి వెలువరించిన తీర్పునే ఖరారు చేశారు. పీపీ హరినాథరెడ్డి తదితరులను జిల్లా ఎస్పీ అన్బురాజన్ అభినందించారు.

3న ప్యాట్-2023 పరీక్షలు

అనంతపురం విద్య, ఫిబ్రవరి 26: ప్రొఫెషనల్ అడ్వాన్స్‌మెంట్ టెస్ట్(పీఏటీ-2023) పరీక్షలు వచ్చే నెల 3వ తేదీ జరుగుతాయని డీఈఓ వరలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ, మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకూ పరీక్షలు ఉంటాయన్నారు. రాష్ట్రంలోని తిరుపతి, రాజమండ్రిలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేశారన్నారు. అనంతపురం నుంచి వెళ్లే అభ్యర్థులు ఎవరైనా పరీక్షా కేంద్రాల వద్ద గంట ముందుగానే ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు www.bse.ap.gov.in వెబ్‌సైట్ నుంచి తమ హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

ధర్మవరంలో టీడీపీ జెండా ఎగరడం ఖాయం

● వాల్మీకుల ఆత్మీయ సమావేశంలో పరిటాల శ్రీరామ్



వాల్మీకులతో కలిసి ర్యాలీగా వస్తున్న పరిటాల శ్రీరామ్

ముదిగుబ్బ, ఫిబ్రవరి 26: వచ్చే ఎన్నికల్లో ధర్మవరం నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగురడం ఖాయమని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ ధీమా వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో సోమవారం వాల్మీకుల ఆత్మీయ సమావేశం సాగింది. తొలుత వారు ర్యాలీ నిర్వహించారు. పరిటాల శ్రీరామ్ ముఖ్యఅతిథిగా హాజరై ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం ఆత్మీయ సమావేశంలో పాల్గొని వాల్మీకి మహర్షి చిత్రపటానికి నివాళులర్పించారు. తర్వాత మాట్లాడుతూ.. వాల్మీకులకు ఒక చరిత్ర ఉందని, సమాజానికి నాగరికత నేర్పింది వాల్మీకులేనని తెలిపారు. పరిటాల కుటుంబానికి, బోయ కులస్థులకు చాలా దగ్గర సంబంధం ఉందని గుర్తు చేసుకున్నారు. గతంలో తమ తాత పరిటాల శ్రీరాములును హత్య చేసిన సమయంలో, బోయ రామాంజనేయులు కూడా ప్రాణ త్యాగం చేసిన విషయాన్ని ప్రస్తావించారు. తన కుటుంబం... వాల్మీకి కులస్థులు వేరు కాదని పేర్కొన్నారు. దేశమంతా వాల్మీకులు ఎస్టీ జాబితాలో ఉంటే.. ఒక రాయలసీమలో మాత్రం బీసీలుగా ఉన్నారన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఎస్టీల్లో కలపడంపై చంద్రబాబు ఖచ్చితంగా దృష్టి సారిస్తారని తెలిపారు. వైసీపీ హయాంలో బీసీలు, ఎస్సీ, ఎస్టీలు తీవ్ర అవమానాలకు గురయ్యారని అన్నారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి గూండాలకు, రౌడీలకు నియోజకవర్గాన్ని అప్పజెప్పారని దుయ్యబట్టారు. ఎన్నికలు ఎంతో దూరంలో లేవని, ప్రతి ఒక్కరూ సైనికుల్లా అడుగు ముందుకు వేయాలని సూచించారు. ధర్మవరం, రాప్తాడు నియోజకవర్గాలు మా కుటుంబానికి రెండు కళ్ల లాంటివని, వాటిని కాపాడుకునే బాధ్యత తమదేనని అన్నారు. కార్యక్రమంలో వాల్మీకి నాయకులు రంగయ్య, బొట్టు కిష్ట, పోతుకుంట లక్ష్మన్న, బోయ రవిచంద్ర, మద్దిలేటి, గొట్లూరు శీనా, తలారిచంద్రమోహన్, చిన్నవీరప్ప, టీడీపీ మండల కన్వీనర్ కరణంప్రభాకర్, క్లస్టర్ ఇన్‌చార్జి తుమ్మల మనోహర్, నాయకులు సూర్యశేఖర్‌రాజు, చికెన్ తిరుపాల్, కిష్టప్ప, సూరి, పోతలయ్య, పవన్, గంగాధర్, రాఘవ, శివయ్య తదితరులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన వైసీపీ నాయకులతో పల్లె

టీడీపీలోకి పది కుటుంబాలు చేరిక

కదిరి, ఫిబ్రవరి 26: అమడగూరు మండలం సోలకుంటపల్లికి చెందిన పది కుటుంబాల వారు సోమవారం వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. జిల్లాకేంద్రమైన పుట్టపర్తిలోని మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి నివాసంలో వారు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పల్లెతో పాటు నియోజవకర్గ పరిశీలకుడు బచ్చలపుల్లయ్య వారికి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పల్లె మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయానికి సైనికుల్లా కృషి చేయాలని సూచించారు. పార్టీలోకి చేరిన వారిలో శ్రీనివాసులు, రవి, అంజి, మణికుమార్, మారుతి, శ్రీకాంత్, నారాయణప్ప, సాయినాథ్‌రెడ్డి, ఈశ్వరప్ప, షబ్బీర్‌అహమ్మద్ తదితరులు ఉన్నారు. నాయకులు మామిడిమేకలపల్లి ఆదినారాయణ రెడ్డి, కంచెరవాండ్లపల్లి క్రిష్టప్ప ఆధ్వర్యంలో వారు పార్టీలోకి చేరారు.

కందికుంట ఆధ్వర్యంలో 30 కుటుంబాలు..



టీడీపీలోకి చేరిన వారితో కందికుంట

కదిరి, ఫిబ్రవరి 26: తలుపుల మండలం ఈదులకుంట్లపల్లి పంచాయతీలోని చంద్రే నాయక్ తండాకు చెందిన 30 కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. కదిరి పట్టణంలోని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ నివాసంలో సోమవారం వారు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి కందికుంట కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. చేరినవారిలో ప్రసాద్‌నాయక్, గోపాల్‌నాయక్, రమేష్, భాస్కర్, శంకర్ నాయక్, జీవ్లానాయక్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు మేడా శంకర్, గరికపల్లి రామకృష్ణారెడ్డి, దేవేంద్రనాయక్, నారాయణరెడ్డి, ఓబులనాయుడు, సూర్యశేఖర్‌రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, శ్రీశైలం రమణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

నల్లమాడ, ఫిబ్రవరి 26: తమ సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఉపాధి హామీ పథకం సిబ్బంది మండలకేంద్రంలో ఎంపీడీఓ మహబూబ్‌దౌలాకు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. 2006లో ఉపాధి హామీ రిక్రూట్‌మెంట్ చట్టం ప్రకారం విధుల్లోకి చేరామన్నారు. వెలుగు సిబ్బందికి ఇస్తున్న సౌకర్యాలు తమకు వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు 15రోజుల్లో పరిష్కరించాలన్నారు. లేకపోతే సమ్మె బాట పడతామని హెచ్చరించారు. ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

నల్లమాడ, ఫిబ్రవరి 26: మండలంలోని రెడ్డిపల్లి రామాపురం సమీపంలో ఎస్ఐ రమేష్ బాబు సోమవారం సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగామాట్లాడుతూ.. ఎన్నికలు సమీపిస్తుండడతో మద్యం, డబ్బులు అక్రమంగా తరలకుండా తనిఖీ చేపడుతున్నామన్నారు. ద్విచక్ర, ఆటో వాహనదారులు ఆర్సీలు, డ్రైవింగ్ లైసెన్సులు తప్పకుండా కలిగి ఉండాలన్నారు. రికార్డులు లేని వాహనాలకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

నేడు భారీ బైక్ ర్యాలీ

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 26: మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 11గంటలకు మండలకేంద్రంనుంచి ఇనగలూరు గొల్లపల్లి వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ శెట్టివారి జయచంద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రా... కదలిరా... కార్యక్రమంలో భాగంగా బైక్‌ర్యాలీ నిర్వహించనున్నామన్నారు. అనంతరం ఇనగలూరు గొల్లపల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తారన్నారు. అంతకుముందు ఉదయం 10గంటలకు విద్యుత్ కోతలకు నిరసనగా, మండలకేంద్రంలోని విద్యుత్‌సబ్‌స్టేషన్ ముట్టడి పల్లె ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్ని జయప్రదం చేయాలని కోరారు.

సోలార్ ప్రాజెక్టులో అగ్ని ప్రమాదం

నంబులపూలకుంట, ఫిబ్రవరి 26: మండలకేంద్రానికి సమీపంలో ఉన్న సోలార్ అల్ట్రా పవర్ ప్రాజెక్టులో ఉన్న సీమెన్స్‌గమేషా కంపెనీలో సోమవారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. కొత్తపల్లి, బత్తినగారిపల్లి గ్రామాలకు సమీన ఏర్పాటు చేసిన సోలార్ ప్రాజెక్టులో అగ్ని ప్రమాదం జరగడంతో ఒక్కసారిగా మంటలు పెద్దఎత్తున వ్యాపించాయి. దట్టమైన పొగ అలముకుంది. మంటలను అదుపుచేయడానికి సిబ్బంది ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. సమాచారం అందుకున్న కదిరి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో కేబుల్ వైర్లు, సోలార్ ప్లేట్లు దగ్ధమైనట్లు తెలుస్తోంది. నాలుగు బ్లాకుల వరకు కాలిపోయినట్లు సమాచారం. ప్రమాదం ఎలా జరిగిందో.. ఎంత నష్టం వాటిల్లిందో తెలియాల్సి ఉంది.

వ్యవసాయ కూలీ మృతి

కదిరి అర్బన్, ఫిబ్రవరి 26: మండలంలోని మల్లయ్యగారిపల్లి వెళ్లే రోడ్డులో వ్యవసాయకూలీ మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు సోమవారం తెలిపిన మేరకు.. ఓబుళదేవరచెరువు మండలం వణుకువారిపల్లికి చెందిన వ్యవసాయ కూలీ రామకృష్ణ (52) ఆదివారం కూలి పనులకోసం కదిరి మండలం మల్లయ్యగారిపల్లికి వెళ్లారు. కాగా ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో అక్కడి రోడ్డులో వ్యక్తి పడిపోయి ఉం డడాన్ని స్థానికులు గమనించి అతని వద్ద ఉన్న సెల్‌ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. విషయం తె లుసుకున్న రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికెళ్లి పరి శీలించి అతను మృతిచెందినట్లుగా చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి మూర్ఛవ్యాధి ఉందని అతని భార్య రామకృష్ణమ్మ ఇచ్చినఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకున్నామన్నారు. మృతుడి ఒంటిపై ఎలాంటిగాయాలు లేవన్నారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నట్లు చెప్పారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ముదిగుబ్బ, ఫిబ్రవరి26: మండలంలోని అడవిబ్రాహ్మణపల్లి తండాకు చెందిన టీడీపీ కార్యకర్త శివకుమార్ నాయక్ ఇటీవల మృతి చెందారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాలశ్రీరామ్ ఆదేశాల మేరకు పార్టీ మండల నాయకులు సోమవారం ఆ తండాకు వెళ్లి మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే 15వేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు తుమ్మలనాయుడు, వినోద్‌బాబు, చరణ్‌కుమార్ శివ తదితరులు పాల్గొన్నారు.

ఖాద్రీశుడి ఆలయ ఉప ప్రధానార్చకుడికి డాక్టరేట్



డాక్టరేట్‌తో కుమార్‌రాజా ఆచార్యులు

కదిరి, ఫిబ్రవరి 26: పట్టణంలోని ఖాద్రీ లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో ఉప ప్రధానార్చకులుగా పని చేస్తున్న కుమార్ రాజా ఆచార్యులకు కలకత్తాలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓరియంటల్ హెరిటేజ్ యూనివర్సిటీ 45వ వార్షికోత్సవం సందర్భంగా డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఈ నెల 17వతేదీన ఆ యూనివర్శిటీలో జరిగిన సమావేశంలో ఈ డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు అర్చకులు సోమవారం తెలిపారు. ధర్మశాస్త్రంలో విశేష ప్రతిభ కలిగి, దాదాపు 25 ఏళ్లుగా ఖాద్రీ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో నిత్య కైంకర్యాలు చేస్తున్నట్లు చెప్పారు. అలాగే ధర్మ ప్రచారం కోసం తనవంతు కృషి చేస్తున్నామన్నారు. ఈ సేవలను గుర్తించి డాక్టరేట్ ఇచ్చి సత్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ యూనివర్సిటీల వీసీలు, సంస్కృత భాషా పండితులు, పలువురు ప్రజాప్రతినిధులు, పశ్చిమ బెంగాల్ హైకోర్టు చీఫ్ జస్టిస్ హాజరైనట్లు పేర్కొన్నారు.

వ్యవసాయానికి 9గంటల విద్యుత్తు ఇవ్వండి

● ట్రాన్స్‌కో అధికారులకు బీజేపీ వినతి



ధర్మవరంలో ట్రాన్స్‌కో కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

ధర్మవరం, ఫిబ్రవరి 26: వ్యవసాయానికి 9గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరాచేసి రైతులను కాపాడాలని ట్రాన్స్‌కో అధికారికి బీజేపీ నాయకులు విన్నవించారు. మాజీ ఎమ్మెల్యేగోనుగుంట్ల సూర్యనారాయణ ఆదేశాల మేరకు వారు సోమవారం పట్టణంలోని మార్కెట్ వీధిలో గల ట్రాన్స్‌కో కార్యాలయం వద్దకు వెళ్లి అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... ఎన్నికలకు ముందు వ్యవసాయానికి 9గంటల నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తామని హామీ ఇచ్చిన వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక 7గంటలు మాత్రమే సరఫరా చేస్తున్నారన్నారు. దీంతో నీరు చాలక రైతులు సాగుచేసిన పంటలు ఎండిపోతున్నాయన్నారు. విద్యుత్ అధికారులు స్పందించి 9గంటల నాణ్యమైన కరెంటును సరఫరా చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అంబటి సతీశ్‌కుమార్, డిష్‌రాజు, చిగిచెర్ల అరవిందరెడ్డి, పుల్లయ్య, తుంపర్తి పరమేశ్, గొట్లూరు చంద్ర, నారాయణస్వామియాదవ్, దుస్సాకృష్ణ, చిలకం సూర్యనారాయణరెడ్డి, బోడగల గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి/ తాడిమర్రి/ముదిగుబ్బ: బత్తలపల్లి మండలకేంద్రంలోని విద్యుత్ కార్యాలయానికి మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ అనుచరులు చేరుకుని వ్యవసాయానికి 9 గంటల నాణ్యమైన విద్యుత్ అందించి రైతులను ఆదుకోవాలని కోరుతూ ఏఈ శివయ్యకు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం పలువురు మాట్లా డుతూ.. మండలంలో వ్యవసాయానికి 9 గంటల విద్యుత్‌ను ఇవ్వకపోవడంతో రైతులు సాగు చేసిన పంటలు ఎండుతున్నాయన్నారు. ఇప్పటికైనా 9 గంటల విద్యుత్‌ను సరఫరా చేయాలన్నారు. లేకపోతే మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ ఆధ్వర్యంలో రైతులతో కలిసి ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు వీరనారప్ప, రామక్రిష్ణ, ప్రభాకర్, సందీప్, శేషు పాల్గొన్నారు.

అలాగే తాడిమర్రి మండలంలోని గోనుగుంట్ల అనుచరులు కూడా మండలకేంద్రంలో విద్యుత్‌శాఖ ఏఈకి వినతిపత్రం అందజేశారు. మండలవ్యాప్తంగా వ్యవసాయానికి 9గంటలపాటు విద్యుత్‌సరఫరా చేయాలని కోరారు. ప్రస్తుతం 7గంటలు మాత్రమే అందిస్తున్నారని, దానికి తోడు ఏ సమయానికి కరెంట్ సరఫరా అవుతుందోనని తెలియని పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వం రైతుల పరిస్థితిని ఆలోచించి పంటలు ఎండిపోకుండా 9గంటల విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. కార్యక్రమంలో వెంకటేష్, ఓబిరెడ్డి, మంజునాథ్, రమణ, అశ్వర్థ, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

అదేవిధంగా ముదిగుబ్బ మండలకేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల అనుచరులు రైతులతో కలిసి నిరసన చేపట్టారు. పలువురు మాట్లాడుతూ.. విద్యుత్ సరిగా సరఫరా కానుందన పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. సీఎం జగన్ వ్యవసాయానికి ఇస్తామన్న 9గంటల నాణ్యమైన విద్యుత్‌ను ఇవ్వలేదన్నారు. పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకునే పరిస్థితిలో లేదన్నారు. ఇప్పటికైనా స్పందించి రైతులకు 9 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను ఇవ్వాలన్నారు. లేనిపక్షంలో గోనుగుంట్ల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం కదిరి విద్యుత్ ఏడీ బాలసుబ్రమణ్యం కు వినతి పత్రం అందజేశారు. నారాయణస్వామి, దేవేందర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, బాల భాస్కర్, వాటర్‌రవి, ల్యాబ్‌నారాయణస్వామి, జయకృష్ణ, రామ్మోహన్, దిలీప్, పీసీరేవురామాంజి, చలపతి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి అక్కదేవతల తిరుణాల

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 26: మండలంలోని అల్లాపల్లి పంచాయతీలో గల దాదారెడ్డిపల్లి సమీపంలో సోమావతి నది ఒడ్డున వెలసిన అక్కదేవతల ఆలయంలో మార్చి 8వ తేదీ నుంచి తిరుణాల నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి వెంకటేష్ తెలిపారు. ఆలయంలో సోమమేఱ వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. పూజారి మాట్లాడుతూ.. 8వతేదీన ఉదయంనుంచి మధ్యాహ్నం వరకు అమ్మవారికి ప్రత్యేక పూజలు, సాయంత్రం 5నుంచి 6గంటల వరకు గిరుగుల పూజ, రాత్రి 8గంటలకు జ్యోతి కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు.

జాబు రావాలంటే.. బాబు రావాలి



పోస్టర్లను ప్రదర్శిస్తున్న టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి అదినారాయణ తదితరులు

పుట్టపర్తి రూరల్, ఫిబ్రవరి 26: రాష్ట్రంలో యువతకు జాబు రావాలంటే బాబు రావాలని టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ అన్నారు. పట్టణంలోని మూడోవార్డులో సోమవారం ఆయన ఓటుహక్కుపై యువతకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో మొదటిసారి ఓటుహక్కును వినియోగించుకునే యువత బాగా ఆలోచించి ఓటు వేయాలన్నారు. చంద్రబాబుతోనే యువతకు ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు. గతంలో ఎన్నో పరిశ్రమలు తెచ్చి యువతకు ఉపాధి కల్పించిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. కనుక ఫస్ట్ ఓటు సీబీఎన్‌కే వేయాలని సూచించారు. బాబు వస్తేనే జాబువస్తుందని తెలిపారు. అనంతరం మైఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్ అనే పోస్టర్లను ప్రదర్శించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు వాల్మీకి శ్రీరాములు, విజయ్, పేట్లరమణ, నారాయణస్వామి, మధు, జనార్దన్, కుమార్, గణేష్, రమేష్, హరి తదితరులు పాల్గొన్నారు.

హెడ్‌బాల్ పోటీల్లో కదిరి విద్యార్థిని ప్రతిభ

కదిరి అర్బన్, ఫిబ్రవరి 26: కర్నూలులో ఈనెల 23, 24 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి హెడ్‌బాల్ పోటీల్లో కదిరి పట్టణంలోని ఎస్‌టీఎస్‌ఎన్ ప్రభుత్వ డిగ్రీకళాశాల విద్యార్థిని రుక్సీరాణి ప్రతిభ చాటినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ స్మిత తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరచి శ్రీసత్యసాయి జిల్లాను రాష్ట్రస్థాయికి మూడోస్థానంలో నిలిపేందుకు దోహదపడిందన్నారు. ప్రతిభ కనబరచిన విద్యార్థినిని సోమవారం కళాశాలలో ప్రశంసా పత్రం, మెడల్ అందించి అభినందించారు. పీడీ నరసింహాచారి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అబాకస్‌లో రూపారాజా స్కూల్ విద్యార్థుల ప్రతిభ

ధర్మవరం, ఫిబ్రవరి 26: విశ్వం ఎడ్యుకేట్ స్కూల్ ఆధ్వర్యంలో అనంతపురంలో ఆదివారం జరిగిన అబాకస్ జిల్లాస్థాయి లెవెల్ కాంపిటేషన్‌లో తమ పాఠశాల విద్యార్థులు సత్తాచాటినట్లు పట్టణంలోని రూపారాజా పీసీఎంఆర్ పాఠశాల చైర్మన్ హర్షవర్ధన్ తెలిపారు. పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న ఆఫియ స్టార్ జూనియర్ లెవెల్-3లో మొదటి బహుమతి, ఐదో తరగతి చదువుతున్న సాయిషమిత సీనియర్ లెవెల్-2లో రెండో బహుమతి, స్టార్ జూనియర్ లెవెల్-1లో ఒకటో తరగతి చదువుతున్న ఉషశ్రీ మూడో బహుమతి సాధించారన్నారు. వారిని సోమవారం పాఠశాలలో చైర్మన్‌తోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.

హోంగార్డులు చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలి

కదిరి, ఫిబ్రవరి 26: జిల్లాలో ప్రముఖుల పర్యటన సందర్భంగా పోలీసులు, బాధ్యతలు నిర్వహించిన విధంగానే హోంగార్డులుకూడా చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని కర్నూల్ రేంజ్ హోంగార్డు కమాండెంట్ మహేష్ కుమార్ తెలిపారు. హోంగార్డు యూనిట్ల పరిశీలనలో భాగంగా సోమవారం ఆయన కదిరికి ఆయన వచ్చారు. అక్కడ హోంగార్డులనుంచి గౌరవవందనం స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ హోంగార్డులు ప్రముఖుల పర్యటన సందర్భంగా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనారోగ్యంతో బాధపడుతున్న హోంగార్డు రామచంద్ర, నాగార్జులను పరామర్శించారు. వారికి ప్రభుత్వ సంక్షేమపథకాలు అందిస్తామన్నారు. ఆర్ఐ ఎచంద్రమోహన్, ఆర్ఎస్ఐలు జయరాములు, షామీర్‌బాషా, ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పంచలోహ విగ్రహాల వితరణ

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 26: మండలకేంద్రంలోని బస్టాండ్ వద్ద వెలిసిన శివాలయానికి స్థానికులైన బొడ్డు నాగరాజు,అరుణ దంపతులు పంచలోహ విగ్రహాలను వితరణ చేశారు. సోమవారం గణపతితో పాటు పార్వతీపరమేశ్వరుల పంచలోహ విగ్రహాలను దాతలు స్వగృహం నుంచి మేళతాళాలతో ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. అక్కడ పూజారి మురళీకి అందజేశారు. అర్చకులు విగ్రహాలకు పూజలు చేసి ఆలయంలో కొలువుదీర్చారు.

లేపాక్షిలో హిందూ సంఘాల ధర్నా

లేపాక్షి, ఫిబ్రవరి 26: మండలకేంద్రలోని లేపాక్షిలో హిందూమత సంఘాలు, బీజేపీ, భజరంగదళ్, ఆర్ఎస్ ఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా లేపాక్షి బస్టాండులో బ్యానర్లు ఏర్పాటు చేశారు. వాటిని ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చించివేశారు. విషయం తెలుసుకున్న బీజేపీ, బజరంగదళ్ ఇతర సంఘాల నాయకులు పెద్ద ఎత్తున సోమవారం రహదారిపై బైఠాయించి ధర్నా చేశారు. బ్యా నర్లు చించేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని నినాదాలు చేశారు. హిందూపురం రూరల్ సీఐ ఈరన్న, ఎస్ఐ గోపి, ఘటనా స్థలానికి చేరుకుని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చి ధర్నాను విరమింపజేశారు.

డీ చెర్లోపల్లిలో భవిష్యత్తుకు గ్యారెంటీ



పొలంలో కూలీలకు కరపత్రాలు ఇస్తున్న టీడీపీ నాయకులు

బత్తలపల్లి ఫిబ్రవరి 26: మండలంలోని డీ చెర్లోపల్లి పంచాయతీలో సోమవారం టీడీపీ నాయకులు బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటితో పాటు పొలాల్లోకి సైతం వెళ్లి అక్కడి కూలీలకు మినీమేనిఫెస్టో కరపత్రాలు పంచుతూ పథకాల గురించి వివరించారు. చంద్రబాబు సీఎం అయితే అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపునకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నారాయణరెడ్డి, నాయకులు చల్లా శ్రీనివాసులు, గంటాపురం జగ్గు, తాళ్లూరి సతీష్, సాంబ, చితంబర్‌రెడ్డి, కృష్ణయ్య, రవి, నారాయణస్వామి తదితరులు పాలొన్నారు.

కలెక్టరేట్‌లో స్పందనకు 215 వినతులు

పుట్టపర్తి, ఫిబ్రవరి 26: జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వినతులు వెల్లువెత్తాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు పలు సమస్యల పరిష్కారం కోరుతూ సుమారు 215 వినతిపత్రాలను అందించారు. కలెక్టర్ అరుణ్‌బాబు వాటిని స్వీకరించి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజలు వినతుల ద్వారా తెలిపిన సమస్యల్ని వెంటనే పరిష్కరించాలని ఆయా అధికారులకు సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం వహించరాదని తెలిపారు. అనంతరం ఆయన జిల్లాలోని ఆయా మండలాల అధికారులతో సమీక్ష జరిపారు. ఓటర్లకు సంబంధించి నమోదు, మార్పులు, చేర్పులకు సంబంధించి క్లయింలను రెండురోజుల్లో పరిష్కరించాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న క్లయింలను వెంటనే పరిష్కరించాలని తెలిపారు. ధర్మవరం డివిజన్‌లో ఎక్కువ క్లైయింలున్నాయని అన్నారు. ఉపాధిహామీ పనుల తీరును ఎంపీడీఓలు పరిశీలించి నివేదిక పంపాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో కొండయ్య నోడల్ అధికారి శ్రీనివాసరెడ్డి, డీపీఓ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు స్పందనకు 27 వినతులు

పుట్టపర్తిరూరల్: జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో ఎస్పీ మాధవరెడ్డి నిర్వహించిన పోలీసు స్పందనలో 27 వినతిపత్రాలు అందాయి. జిల్లాలోని పలు ప్రాంతాల ప్రజలు వివిధ సమస్యలకు పరిష్కారం కోరుతూ ఆ వినతులను అందించారు. ఎస్పీ వాటిని స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ స్పందనలో ప్రజలు తెలిపిన సమస్యల్ని మొదటి ప్రాధాన్యతగా భావించి వెంటనే పరిష్కరించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. వృద్ధులు, వికలాంగుల పట్ల సహృదయంతో వ్యవహరించాలన్నారు. సుదూర ప్రాంతాల నుంచి జిల్లాకేంద్రానికి రాలేని వృద్ధులు, వికలాంగులు, మహిళలు మీ దగ్గర ప్రాంతాల్లోని స్థానిక పోలీసు స్టేషన్‌లలో కూడా వినతిపత్రాలు ఇవ్వవచ్చని చెప్పారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎస్.విష్ణు, జిల్లాక్రైం బ్రాంచ్ సీఐ శ్రీహర్ష, లీగల్‌సెల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.





కలెక్టరేట్, జిల్లా పోలీస్ కార్యాలయంలో వినతిపత్రాలు స్వీకరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి

యశోదమ్మ ప్రచారం



ప్రచారం చేస్తున్న కందికుంట యశోదమ్మ

కదిరి, ఫిబ్రవరి 26: పట్టణంలోని 17వ వార్డులో సోమవారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకట ప్రసాద్ సతీమణి కందికుంట యశోదమ్మ ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సం దర్భంగా ఇంటింటా తిరిగి వచ్చే ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేయాలని ప్రజల్ని కోరారు. చంద్రబాబు ప్రకటించిన మినీ మేనిఫెస్టోను వివరించారు. 20 ఏళ్లుగా నియోజకవర్గ ప్రజలకు తోడుగా ఉంటున్న కందికుంట వెంకట ప్రసాద్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. వార్డు ప్రజలు ఆమెకు ఘనస్వాగతం పలికారు. మహిళలు హారతులు పట్టారు. ఆమె వెంట 17వ వార్డు కౌన్సిలర్ సావిత్రమ్మ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠ

నల్లచెరువు, ఫిబ్రవరి 26: మండలంలోని దేవిరెడ్డి పల్లి గ్రామం వద్ద యాతంబాయి గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠను సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారి మూలవిరాట్‌కు ప్రత్యేకాలంకరణలు, విశేష పూజలు జరిపారు. అలాగే ఆలయం ఎదుట హోమాలు, యాగాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ హాజరై అమ్మవారిని దర్శించి పూజలు చేయించారు. తర్వాత ఆయన్ను గ్రామ సర్పంచ్ హర్షవర్ధనాయుడు తదితరులు దుశాలువా, పూలమాలలతో సన్మానించారు. టీడీపీ నాయకులు అశ్వర్థనాయుడు, కిరణ్‌కుమార్‌నాయుడు, మల్లికార్జున, ప్రసాద్, సతీష్‌నాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కౌ లిఫ్టింగ్ యంత్రం వితరణ

తనకల్లు, ఫిబ్రవరి 26: ఇటీవల పాడి పశువులు అనారోగ్యానికి గురై లేవలేక, నడవలేక చని పోతున్నాయి. లేవలేని పశువులను లేపి వైద్యం చేయడానికి అటు రైతులు, ఇటు పశువైద్యాధికా రు లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని తవళం పశువైద్యాధికారి డాక్టర్ హరినాథ్ రెడ్డి వందేమాతరం టీమ్ దృష్టికి తీసుకొచ్చారు. కౌ లిఫ్టింగ్ యంత్రాలను తమిళనాడులో తయారు చేస్తున్నారని, రూ.40వేల దాకా ఖర్చు అవుతుందని, అలాంటి యంత్రాలు మన ప్రాంతంలో ఉంటే నేల పడిపోయిన పశువులను లేపి.. వైద్యం చేయడం ద్వారా వాటి ప్రాణాలను కాపాడే అవకాశముంటుందని వివరించారు. దీనికి స్పందించిన వందేమాతరం టీమ్ సభ్యులు తమిళనాడు నుంచి కౌలిఫ్టింగ్ మిషన్‌ను తీసుకొచ్చి సోమవారం విరాళంగా అందించారు. ఈ మిషన్‌ను కొక్కంటి క్రాస్ సమీపంలోని బాలసముద్రం గ్రామంలో ఉన్న జంబులింగేశ్వర ఆలయం వద్ద పాడి రైతులకు అందుబాటులో ఉంచుతున్నట్లు తవళం పశువైద్యాధికారి చెప్పారు. పాడిరైతులు ఈ మిషన్‌ను ఉచితంగా వినియోగించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వందేమాతరం టీమ్ సభ్యులు రవీంద్ర, భాస్కర్, సత్య, బాలకృష్ణ, విశ్వనాథ్, నవీన్, సుధాకర్, షాకీర్, బాగేపల్లి అశోక్, సుబ్బయ్య, హోటల్ శ్రీనాథ్, పాడిరైతులు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నూతన నిబంధనలను రద్దు చేయాలి

ధర్మవరం, ఫిబ్రవరి 26: చేనేత కార్మికులకు నూతన పెన్షన్లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన నూతన నిబంధనలను వెంటనే రద్దు చేయాలని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయనతో పాటు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పోలా లక్ష్మీనారాయణ, గౌరవాధ్యక్షుడు వెంకటస్వామి సోమవారం పట్టణంలో ఆర్డీఓ వెంకటశివారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.... అర్హులైన చేనేత కార్మికులకు పింఛన్లు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గత నెలలో ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. దీంతో జనవరి నుంచి చేనేత పింఛన్ వస్తుందనుకున్న చేనేత కార్మికుల ఆశలు ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త నిబంధనల వల్ల నిరాశలయ్యాయన్నారు. కొత్త నిబంధనల ప్రకారం చేనేత కార్మికులు పింఛన్ పొందాలంటే.. రెండేళ్ల పాటు చేనేత వస్త్రాలకు ఉపయోగించే వార్పులు, రేషన్ కొనుగోలుకు సంబంధించిన జీఎస్టీ బిల్లులు , ఆన్‌లైన్ ద్వారా వేతనాలు పొందుతున్నట్టు బ్యాంకు లావాదేవీల ఆధారాలు తప్పనిసరి అని చెప్పడం బాధాకరమన్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త నిబంధనను రద్దు చేసి 45 ఏళ్లకే పింఛన్‌ను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్డీఓ స్పందిస్తూ ఈ విషయాన్ని ప్రభుత్వం, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో చేనేత నాయకులు ఆదినారాయణ, బాబు, శ్రీధర్, శ్రీనివాసులు, చట్టగంగాధర్, మురళీకృష్ణ పాల్గొన్నారు.

టీడీపీతోనే యువతకు భవిష్యత్తు

ధర్మవరం, ఫిబ్రవరి 26: టీడీపీతోనే యువతకు భవిష్యత్తు ఉంటుందని తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి చిన్నూరవిజయ్‌చౌదరి పేర్కొన్నారు. ఈ మేరకు పట్టణంలోని ప్రభుత్వబాలికల జూనియర్ కళాశాల వద్ద యువగళం-ఆంధ్రుల బలం పోస్టర్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... టీడీపీ అధికారంలోకి వస్తే యువత సంక్షేమానికి పెద్దపీట వేయడం జరుగుతుందన్నారు. అలాగే అమ్మకు వందనం కింద ఇంటిలో ఎంతమంది పిల్లలుంటే అంతమందికి.. ఒక్కొక్కరికి రూ.15వేలు, మిషన్ రాయలసీమ కింద ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ ప్రకటించి ప్రభుత్వ ప్రైవేటు రంగంలో 20లక్షల ఉద్యోగాలు కల్పించడం, ఉపాధి కల్పన పథకం కింద డిగ్రీలు పూర్తి చేసిన విద్యార్థులు ఎక్కడో సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా స్థానికంగా అనేక కంపెనీలను స్థాపించి ఉద్యోగాలు కల్పించడం జరుగుతుందన్నారు. నిరుద్యోగ భృతికింద రూ.3వేలు, కేజీ నుంచి పీజీ వరకు ప్రతి విద్యార్థికి కోతలు లేకుండా పూర్తిగా ఫీజు రీయింబర్స్ మెంట్ అందించడం జరుగుతుందని చెప్పారు.కార్యక్రమంలో నాయకులు సుధాకర్‌నాయు డు, శీన, పవన్, రమేశ్, యుగంధర్, ముత్యాలు పాల్గొన్నారు.



యువగళం-ఆంధ్రుల బలం పోస్టర్లను ఏర్పాటు చేసిన తెలుగుయువత నాయకులు

ఘనంగా మాఘమాస పూజలు



విశేష అలంకరణలో చంద్రమౌళేశ్వరస్వామి

మడకశిర టౌన్, ఫిబ్రవరి 26: మాఘమాసం పురస్కరించుకొని సోమవారం పట్టణంలోని చంద్రమౌళీశ్వరస్వామిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని కోట వెంకటేశ్వరస్వామి, మిట్టబండ ఆంజనేయస్వామి, అభయాంజనేయస్వామి, వీరభద్రేశ్వర, భోగరామలింగేశ్వర, మూలకంఠేశ్వరి, పూజమ్మదేవి తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. వెంకటేశ్వరస్వామికి ప్రాకారోత్సవం జరిపారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఇంటర్ విద్యార్థులకు హాల్ టిక్కెట్ల పంపిణీ

పెనుకొండ, ఫిబ్రవరి 26: రాష్ట్రంలో మార్చి 1నుంచి ప్రారంభంకానున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు సోమవారం స్థానిక జూనియర్ కళాశాలలో హాల్‌టికెట్లను పంపిణీ చేశారు. పెనుకొండ జూనియర్ కళాశాలకు సంబంధించి ఇంటర్ మొదటి, రెండు సంవత్సరాలు, ఒకేషనల్ కోర్సు కు చెందిన 696మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ప్రిన్సిపాల్ బషీర్ అహ్మద్ తెలిపారు. విద్యార్థులందరికీ హాల్‌టికెట్లు అందజేశామన్నారు.

సీతారాముల విగ్రహ ప్రతిష్ఠకు విరాళం

లేపాక్షి, ఫిబ్రవరి 26: మండలపరిధిలోని బిసల మానేపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీరామ దేవాలయంలో సీతారాములు విగ్రహాల ప్రతిష్ఠ కోసం అదే గ్రామానికి చెందిన అంగడి ప్రకాశ్ రూ.1.45లక్షల విరాళం అందజేశారు. విగ్రహ ప్రతిష్ఠ రోజు అయ్యే ఖర్చును తానే భరిస్తానన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

లేపాక్షిలో హిందూసంఘాల ధర్నా

లేపాక్షి, ఫిబ్రవరి 26: మండలకేంద్రలోని లేపాక్షిలో హిందూమత సంఘాలు, బీజేపీ, భజరంగదళ్, ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా లేపాక్షి బస్టాండులో బ్యానర్లు ఏర్పాటు చేశారు. వాటిని ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చించివేశారు. విషయం తెలుసుకున్న బీజేపీ, బజరంగదళ్ ఇతర సంఘాల నాయకులు పెద్దఎత్తున సోమవారం రహదారిపై బైఠాయించి ధర్నా చేశారు. బ్యానర్లు చించేసిన వారిని సీసీ కెమెరాల ద్వారా గుర్తించి వెంటనే అరెస్ట్ చేయాలని నినాదాలు చేశారు. పోలీసులు రాత్రిపూట గస్తీ తిరగకపోవడంతోనే ఇలాంటివి చోటుచేసుకుంటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న హిందూపురం రూరల్ సీఐ ఈరన్న, ఎస్‌ఐ గోపి, ఘటనా స్థలానికి చేరుకుని నాయకులతో మాట్లాడారు. నిందితులను గుర్తించి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు.

టీడీపీ కార్యకర్త మృతికి సవిత నివాళి

రొద్దం, ఫిబ్రవరి 26 : మండంలోని చిన్నమంతూరులో టీడీపీ కార్యకర్త తిమ్మయ్య(60) అనారోగ్యంతో మృతి చెందగా పెనుకొండ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి సవిత నివాళులు అర్పించారు. ఆమె సోమవారం రొద్దం మండల పరిధిలోని మృతుడి స్వగ్రామమైన చిన్నమంతూరుకు వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. టీడీపీ కోసం తిమ్మయ్య చేసిన సేవలను కొనియాడారు. ఆమె వెంట టీడీపీ నాయకులు చిన్నప్పయ్య, నరసింహులు, మాధవ నాయుడు, వెంకటరామిరెడ్డి, టైలర్ ఆంజనేయులు, పాతర్లపల్లి నరసింహ, రామాంజనేయులు, వెంకటేశులు, వాణి, వీరాంజనేయులు, తిరుపాల్‌నాయుడు, కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం, రోడ్డు రోలర్ ఢీ.. విద్యార్థికి గాయాలు

గోరంట్ల, ఫిబ్రవరి 26: మండలంలోని కదిరి ప్రధాన రహదారిపై కోరేవాండ్లపల్లి వద్ద జరిగిన ద్విచక్రవాహనం, రోడ్డు రోలర్ ఢీకొని డిప్లొమా చదువుతున్న నూర్ మహమ్మద్ సోమవారం తీవ్రంగా గాయపడ్డాడు. ఓడీసీ మండలం లోని కొక్కంటివారిపల్లికి చెందిన బాబాయ్య కుమారుడు నూర్ మహమ్మద్ హిందూపురం సమీపంలోని బిట్స్ కళాశాలలో డిప్లొమా చదువుతున్నాడు. ఆదివారం స్వగ్రా మానికెళ్లిన అతడు సోమవారం కళాశాలకు ద్విచక్రవా హనంలో వస్తున్నాడు. రోడ్డు విస్తరణ పనులు జరుగు తుండగా కోరేవాండ్లపల్లి వద్ద రోడ్డు రోలర్ ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే గోరంట్ల ప్రభుత్వాసుపత్రికి తరలించగా, డాక్టర్ వినోద్‌కుమార్ చికిత్సలు అందించారు. ఎడమకాలు విరిగి, నడుము వద్ద దెబ్బ తినడంతో, మెరుగైన వైద్యం కోసం 108లో హిందూపురం తరలించారు.

ఈత చెట్ల తొలగింపుపై కలెక్టర్‌కు ఫిర్యాదు



ఈతచెట్లను తొలగించి భూమిని ఆక్రమించిన దృశ్యం

రొద్దం, ఫిబ్రవరి 26: మండలంలోని కంచిసముద్రం గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు ఈతచెట్లను ఎక్స్‌కవేటర్ సాయంతో అక్రమంగా తొలగించి భూమిని ఆక్రమిం చుకుంటున్నారని జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబుకు స్పందన లో సోమవారం ఫిర్యాదు చేసినట్లు కల్లుగీత కార్మికుడు గోపాల్ తెలిపారు. కంచిసముద్రం గ్రామానికి చెందిన తాడెప్ప, కిష్టప్ప, నాగముని, చిన్ననాగప్ప అనేక సంవత్స రాలుగా పెంచుకుంటున్న ఈత చెట్లను కొంతమంది తొలగించి బోర్లు వేస్తున్నారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదుచేసినట్లు తెలిపా రు. అనాది కాలం నుంచి సాగుచేసుకుంటున్న ఈతచెట్లను తొలగించి భూములు ఆక్రమించుకుంటున్నారని, ఆక్రమణ దారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

దోపిడీకే వైసీపీ వలస పక్షుల రాక



యుద్ధానికి సిద్ధమంటున్న టీడీపీ, జనసేన నాయకులతో సవిత

- దోచుకుని ఒకరు వెళ్లారు... ఇప్పుడు మరొకరొచ్చారు..
- టీడీపీ పెనుకొండ నియోజకవర్గ అభ్యర్థి సవిత

పెనుకొండ టౌన్, ఫిబ్రవరి 26: వైసీపీ అధికారంలోకి రాగానే స్థానిక పరిశ్రమ యాజమాన్యాన్ని బెదిరింపులతో మొదలుపెట్టి దోపిడీ చేయడానికి వైసీపీ వలస పక్షులను జగన్మోహన్‌రెడ్డి పెనుకొండకు ఎంపిక చేశారని టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి సవిత మండిపడ్డారు. ఆమె సోమవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో టీడీపీ, జనసేన నాయకులతో సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా సమిత మాట్లాడుతూ... ఎన్నికలకు యుద్ధానికి సిద్ధం గా ఉండాలని, సమయం తక్కువగా ఉందని ఆమె నాయకులకు తెలిపారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న పుడు అభివృద్ధే ధ్యేయంగా పనిచేసి, కియలాంటి అంతర్జాతీయ పరిశ్రమలను వాటి అనుబంధ పరిశ్రమలను నియోజకవర్గానికి తీసుకొచ్చినట్లు తెలిపారు. అయితే వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు వలస పక్షులని, వారు దోచుకోవడానికే వస్తుంటారన్నారు. వారికి నియోజకవర్గం అభివృద్ధి, ప్రజల సమస్యలు పట్టవ న్నారు. ఇలా గతంలోనే హెచ్చరించామన్నారు. ఎమ్మెల్యే శంకర్ నారాయణ పదవి ఉండగానే దోచుకుని వేరే ప్రాంతానికి ఎగిరిపోయాడన్నారు. ఇదే తరహా లో కళ్యాణదుర్గం ఎమ్మెల్యే, మంత్రి అయిన ఉషశ్రీ అక్కడ దొరికినకాటికి కొల్ల గొట్టి, మంది మార్బలంతో పెనుకొండను దోపిడీ చేయడానికి వచ్చారన్నారు. కళ్యాణదుర్గంలో ఆమె దోపిడీ గురించి ఏ గల్లీలో అడిగినా కథలు కథలుగా చెబుతారన్నారు. వైసీపీ స్థానిక నాయకులు కూడా ఆమెతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఇప్పటికైనా పెనుకొండ నియోజకవర్గ ప్రజలు దోచుకోవడమే పనిగా పెట్టుకున్న వైసీపీ వలస పక్షి, ప్రస్తుత మంత్రి ఉషశ్రీతో తస్మాత్ జాగ్రత్త అన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ పెనుకొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కుమార్, మాజీ జడ్పీటీసీ వెంకటరమణ, టీడీపీ మండల కన్వీనర్ శ్రీరాములు, మాజీ సర్పంచ్ సూరి తదితరులు పాల్గొన్నారు.

సవితకు పలువురి సన్మానం

టీడీపీ పెనుకొండ నియోజకవర్గ అభ్యర్థి సవితను ప్రకటించడంతో పట్టణంలోని పార్టీ కార్యాలయం జనసంద్రంగా మారింది. ఆమెను పార్టీ కార్యాలయంలో సోమవారం నియోజకవర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలు, మహిళలు, ప్రజాసంఘాలు, జనసేన నాయకులు, కులసంఘాల వారు వివిధ రకాలుగా సన్మానించారు. కురుబ కులస్థులు సంప్రదాయ పద్ధతిలో కంబడితో సన్మానించి గొర్రెను బహుమతిగా అందించారు. పరిగి మండలానికి చెందిన వడ్డెర సాధికార సమితి రాష్ట్ర సభ్యుడు హనుమయ్య, మాజీ ఎంపీపీ సత్యనారాయణ, మాజీ కన్వీనర్ గోవిందరెడ్డి, లక్ష్మణరావు, వాల్మీకి బలరాం, వేణు, గురుస్వామి, వడ్డెర సంఘం మహిళలు, అలివేలమ్మ, లక్ష్మమ్మ తదితరులు పూలమాలలు, శాలువాతో సన్మానించారు. పెనుకొండ మండలం రాంపురం పంచాయతీ పరిధిలో టీడీపీ, జనసేన నాయకులతో కలిసి ఆమె ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. రాంపురం వచ్చిన సవితను పెద్దఎత్తున సన్మానించారు.

టీడీపీ విజయానికి సమష్టిగా కృషి చేద్దాం

మాజీ ఎమ్మెల్యే మద్దనకుంట ఈరన్న



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఈరన్న, పాల్గొన్న సునీల్‌కుమార్

మడకశిరటౌన్, ఫిబ్రవరి 26: మడకశిర నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిని గెలిపించి చంద్రబాబుకు కానుకగా ఇద్దామని మాజీ ఎమ్మెల్యే మద్దనకుంట ఈరన్న పిలుపునిచ్చారు. అందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేద్దామన్నారు. అమరాపురం మండల కేంద్రంలో సోమవారం టీడీపీ, జనసేన పార్టీ విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. టీడీపీ మడకశిర నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్‌తో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి అక్రమాలను ఎండగట్టాలన్నా, రాష్ట్రం సర్వతో ముఖాభివృద్ధి చెందాలన్నా ఒక్క చంద్రబాబుతోనే సాధ్యపడుతుందన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలన్న లక్ష్యంతో క్షేత్రస్థాయిలో అందరం కష్టపడి పనిచేద్దామని పిలుపునిచ్చారు. టీడీపీ అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ... గత టీడీపీ ప్రభుత్వంలో మడకశిర నియోజకవర్గం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందిందని, వైసీపీ అధికారంలోకి వచ్చాక నియోజకవర్గం అభివృద్ధి ఆగిపోయిందన్నారు. ప్రతి చెరువుకు నీరు రావాలన్నా , పరిశ్రమలు ఏర్పాటై నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభించాలన్నా అర్ధాంతరంగా ఆగిన పనులు పూర్తికావాలన్నా టీడీపీతోనే సాధ్యమన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడితేనే కష్టాల్లో ఉన్న రాష్ట్రాన్ని గట్టెక్కించగలచని, ఆగిపోయిన రాజధానిని పూర్తిచేయగలరని పేర్కొన్నారు. చంద్రబాబు నిరుద్యోగయువతకు ఉపాధి చూపించగలరని, విజనరీ ఉన్న నాయకుడన్నారు. ఎన్నికల ప్రచారంపై నాయకులు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు ఆదినారాయణ, అశ్వత్థరామప్ప, వక్కలిగ సాధికార కమిటీ అధ్యక్షుడు వీఎం పాండురంగప్ప, రైతు కార్యదర్శి ఉగ్రనరసింహప్ప, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దేశమంతా పురంవైపు చూసేలా చేస్తా

3న జాబ్ మేళా.. శ్రీపీఠం అధిపతి పరిపూర్ణానందస్వామి



జాబ్‌మేళా పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 26: దేశం మొత్తం హిందూపురం వైపు చూసేలా అభివృద్ధి చేస్తానని శ్రీపీఠం అధిపతి పరిపూర్ణానందస్వామి పేర్కొన్నారు. ఆయన సోమవారం పట్టణంలోని 11వ వార్డు కౌన్సిలర్ అంజలీ రమేష్ రెడ్డి స్వగృహంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ ప్రాం తంతో తనకు చాల అనుబంధం ఉందన్నారు. హిందూ అనే శబ్దం ఉండడంతో హిందూపురం అంటే చాలా ఇష్టమన్నారు. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని తలచి, దేశ వ్యాప్తంగా ఉన్న మంచి 60 కంపె నీలతో మాట్లాడానన్నారు. మార్చి 3న హిందూపురం ఎస్‌డీజీఎస్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించామన్నారు. మొదటి విడతలో ఐదు వేల మందికి, తరువాత మరో 15 వేల మంది వరకు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు వచ్చేలా చేస్తామన్నారు. జిల్లా ప్రజలకు నీరందించి సత్యసాయిబాబా చిరస్థాయిగా ప్రజల గుండెల్లో నిలిచారన్నారు. తానూ ఈ ప్రాంత ప్రజలకు మంచి చేయ తలచానన్నారు. అధిష్ఠానం తనకు ఎంపీ టిక్కెట్ ఇచ్చి, తాను గెలిస్తే ఈ ప్రాంతానికి కంపెనీలు తీసుకొచ్చి, దేశం మొత్తం పురం వైపు చూసేలా చేస్తానన్నారు. ఈ సందర్భంగా జాబ్‌మేళా పోస్టర్లు విడుదల చేశారు.

సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అవసరం

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్బయ్య

మడకశిరటౌన్, ఫిబ్రవరి 26: ప్రస్తుతం పోటీప్రపంచంలో విద్యార్థులకు కంప్యూటర్ సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అవసరం అని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ సుబ్బయ్య పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఆర్డీటీ వారి ఆధ్వర్యంలో కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ... ఆర్డీటీ అందించిన కంప్యూటర్లు విద్యార్థులు సాంకేతికంగా తమ పరిజ్ఞానాన్ని పెంచుకోనేందుకు ఎంతో దోహద పడుతాయని తెలిపారు. ప్రస్తుతం ఎలాంటి ఉద్యోగం చేయాలన్నా కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరిగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీటీ రీజినల్ డైరెక్టర్ మల్లికార్జున, ఏటీఎల్ సుదర్శన్‌రెడ్డి, రాఘవేంద్ర, అబ్దుల్, అధ్యాపకులు నాగరాజు, అనీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్‌కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్



అడదాకులపల్లిలో పోలింగ్ కేంద్రాలపై ఆరాతీస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

హిందూపురం అర్బన్/పెనుకొండ రూరల్/రొద్దం, ఫిబ్రవరి 26: పరిగి మండలం పైడేటి, ధనాపురం, హోసంపల్లి, పోలింగ్‌కేంద్రాలను జిల్లా కలెక్టర్ అరుబాబు, పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వభరత్ సోమవారం పరిశీలించారు. కేంద్రాల్లో సరైన సౌకర్యాలు ఉన్నాయాలేదా అని ఆరాతీశారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా చూడాలని డిప్యూటీ తహసీల్దార్ నరసింహులు, బీఎల్‌ఓలకు సూచించారు. అలాగే పెనుకొండ మండలంలోని రాంపురం, అడదాకులపల్లి, వెంకటరెడ్డిపల్లి, ఇస్లాపురం పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అదేవిధంగా రొద్దం మండలంలోని కే మరువపల్లి, సానిపల్లి, కలిపి పోలింగ్ బూత్‌లను ఆయన పరిశీలించారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్ల సౌకర్యాలపై అధికారులతో ఆరాతీశారు.

రైలు కిందపడి విద్యార్థి ఆత్మహత్య



నవీన్‌కుమార్ రెడ్డి (ఫైల్)

పూతలపట్టు, ఫిబ్రవరి 26: రైలు కిందపడి ఓ ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. పరిగి మండలం దాసరిపల్లెకు చెందిన శివశంకర్ రెడ్డి కుమారుడు నవీన్‌కుమార్‌రెడ్డి (22), చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలంలోని ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్‌ఈ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఇతడు కళాశాల సమీపాన మిత్రులతో కలిసి ఓ అద్దె ఇంట్లో నివాసముంటున్నాడు. ఏమైందో ఏమోగానీ నవీన్‌కుమార్‌రెడ్డి ఆదివారం అర్ధరాత్రి ముత్తిరేవుల ఫ్లైఓవర్ సమీపాన రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు చిత్తూరు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇతడి ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

ఉచిత కంటి వైద్య శిబిరం

పావగడ, ఫిబ్రవరి 26: భారతీయ పరివర్తన సంఘం(బీటీఎస్) జైభీం గ్రామీణాభివృద్ధి సంస్థ, నిసర్గదృష్టిధామ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం న్యాయద గుంటె గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి దాదాపు 200 మందికిపైగా పరీక్షలు చేయించుకున్నారు. బీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు హైకోర్టు న్యాయ వాదులు ప్రొఫెసర్ హరిరామ్ ఆధ్వర్యంలో ఇటువంటి శిబిరాలు తాలూకాలోని ప్రతి గ్రామ పంచాయతీలో నిర్వహించనున్నట్లు తాలూకా అధ్యక్షుడు కెంచరాయ తెలిపారు.

ఒకేరోజు ఏడుగురికి శస్త్రచికిత్స...

నాలుగు రోజుల్లో ముగ్గురి మృతి

పావగడ ఆసుపత్రి వద్ద బంధువుల ఆందోళన



ఆసుపత్రి వద్ద ఆందోళన చేస్తున్న మృతుల బంధువులు

పావగడ, ఫిబ్రవరి26: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో ఈనెల 22వ తేదీన ఏడుగురు మహిళలకు వివిధ శస్త్రచికిత్సలు చేశారు. అనంతరం ఇక్కడి వైద్యుల నిర్లక్ష్యానికి నాలుగురోజుల్లోనే ముగ్గురుమహిళలు మృతిచెందారని మృతుల కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు సోమవారం ఆసుపత్రి వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఈనెల 22న వీర్లగొంది గ్రామానికి చెందిన అనిత(30)కు పావగడ ఆసుపత్రిలో గైనకాలజిస్టు డాక్టర్ పూజ కుటుంబనియంత్రణ శస్త్ర చికిత్స చేశారు. అయితే శస్త్ర చికిత్స చేసిన కొ న్ని గంటల్లోనే ఆమె ఆసుపత్రిలోనే మృతిచెందింది. అలాగే రాజవంతి గ్రామా నికి చెందిన అంజలి(20)అనే గర్భిణికి అదేడాక్టర్ సిజేరియన్ అపరేషన్ చేసి బిడ్డను బయటకు తీసింది. ఆమె పరిస్థితి విషమంగా ఉండటంతో బెంగుళూరు లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆమె అక్కడ చికిత్స పొందుతూ 24వ తేదీన మృతిచెందింది. అదేవిధంగా బ్యాడనూరుకు చెందిన నరసమ్మ (40) అనే మహిళకు ఆ డాక్టర్ గర్భకోశం అపరేషన్ చేశారు. వెంటనే ఆమె పరిస్థితి విషమంగా మారడంతో బెంగుళూరులో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ 25వతేదీన ఆమె కూడా మృతిచెందింది. అపరేషన్ చేసిన నాలుగురోజుల్లోనే ముగ్గురు మహిళలు వైద్యుల నిర్లక్ష్యం వల్లే మృతిచెందారని మృతుల కుటుంబసభ్యులు పావగడ ప్రభుత్వాసుపత్రిలోనూ, ప్రధానరహదారిలోనూ కొన్ని గంటలు పాటు ఆందోళన చేపట్టారు. ముగ్గురు మహిళల మృతికి కారణమైన డాక్టర్ పూజను వైద్య వృత్తి నుంచి డిస్మిస్ చేయాలని నినాదాలు చేశారు. ఈమేరకు పావగడ పోలీస్‌స్టేషన్‌లో డాక్టర్ పూజపై కేసు నమోదైంది. ఇదిలాఉండగా తుముకూరు డీహెచ్‌ఓ మంజునాథ్, ఇతర జిల్లా అధికారులు పావగడ ప్రభుత్వాసుపత్రి తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సంబంధిత వైద్యులు కఠినచర్యలు తీసుకుంటామని వారు తెలియజేశారు.

టీడీపీ కార్యాలయం ప్రారంభం



పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

గోరంట్ల, ఫిబ్రవరి 26: పట్టణంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద టీడీపీ కార్యాలయాన్ని సోమవారం ప్రారంభించారు. టీడీపీ పెనుకొండ నియోజకవర్గ అభ్యర్థిగా సవితను ప్రకటించడంతో ఆమె గోరంట్లలో కార్యాలయం ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. హిందూపురం రోడ్డులో పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవం సం దర్భంగా దివంగత నేతలు ఎన్టీరామారావు, మాజీ మంత్రి ఎస్ రామచంద్రారెడ్డి చిత్రపటాలకు టీడీపీ నాయకులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా సవిత భర్త వెంకటేశ్వరరావు మాట్లాడుతూ... టీడీపీ విజయానికి ప్రతి ఒకరు ఐకమత్యంతో కృషి చేయాలని కోరారు. అందుకు తమవంతు సహాయ, సహకారాలుంటాయన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నిమ్మల చంద్ర శేఖర్, నిమ్మల శిరీష్, నిమ్మల శ్రీధర్, కక్కల రఘునాథరెడ్డి, బాలక్రిష్ణచౌదరి, సుబ్రహ్మణ్యం, నరేష్, జౌలి కిష్టప్ప, కాయల ఓబులేసు, గాండ్ల ఆంజనేయులు, నాగరాజు, వెంకటేష్, జనసేన మండల కన్వీనర్ సంతోష్ తదితరులున్నారు.

బాగా చదివి ఉన్నతశిఖరాలకు చేరాలి: కలెక్టర్



ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లతో కలెక్టర్ అరుణ్‌బాబు

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 26 : విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రులకు భారం కాకుండా ఉన్నత శిఖరాలు అధిరోహించాలని జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, సబ్ కలెక్టర్ అపూర్వభరత్ సూచించారు. పెనుకొండ మండలం రాంపురం గ్రామ పంచాయతీలో వారు సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు చేస్తున్న శుభ్రత పనులను పరిశీలించి హర్షం వ్యక్తం చేశారు. పోటీ పరీక్షలపై పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ పీఓ కాంతారావు, వలంటీర్లు పాల్గొన్నారు.

వేసవిలో తప్పక జాగ్రత్తలు పాటించాలి: వైద్యాధికారి

వేసవి సమీపిస్తోందని, ఎండ తీవ్రమవుతున్న తరుణంలో ప్రతిఒక్కరూ తప్పక జాగ్రత్తలు పాటించాలని ప్రభుత్వ వైద్యాధికారి మోహన్‌బాబు పేర్కొన్నారు. పెనుకొండ మండలంలోని రాంపురంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-3 ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక శిబిరంలో వైద్యాధికారి మాట్లాడారు. ఎండ తీవ్రతతో శరీరంలో నీటి శాతం లోపించి రక్తసరఫరాలో జాప్యం ఏర్పడుతుందన్నారు. కావున ప్రతి ఒక్కరూ వేసవిలో నీరు అధిక శాతం తాగి వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'టీడీపీ గెలుపే ధ్యేయంగా పనిచేయాలి'

అగళి, ఫిబ్రవరి 26: తెలుగుదేశం పార్టీ గెలుపే ధ్యేయంగా ప్రతిఒక్కరూ కష్టపడి పనిచేయాలని టీడీపీ మండల నాయకులు, కార్యకర్తలు కోరారు. అమరాపు రం మండలంలో జరిగిన టీడీపీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో పాల్గొనేందు కు అగళి మండలం నుంచి దాదాపు 300మంది వరకు వెళ్లినట్లు నాయకులు శివలింగప్ప, అలీఖాన్, ఎంపీటీసీ నాగోజీ, గోవిందప్ప, శివన్న, దినేష్ తదితరులు తెలిపారు. తెలుగుదేశం పార్టీ అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే ఈరన్న ఆధ్వర్యంలో ఈ సమావేశం నిర్వహించినట్లు వారు తెలిపారు. అందరూ పార్టీ బలోపేతం కోసం కలిసి కట్టుగా పనిచేసేందుకు తరలి వెళ్లినట్లు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన



మొక్కలు నాటుతున్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

గోరంట్ల, ఫిబ్రవరి 26: మండలంలోని శిరగమవాండ్లపల్లిలో ఎస్‌పీపీఎం డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు మొక్కలు నాటే కార్యక్రమాన్ని సోమవారం చేపట్టారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా గ్రామంలో విద్యార్థులు పర్యావరణ పరిరక్షణపై ప్రదర్శన జరిపారు. ఇంటింటికెళ్లి మొక్కలు నాట్టడం వలన కలిగే ప్రయోజనాలు, పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణ గురించి వివరించారు. ఇళ్లవద్ద మొక్కలు నాటిన విద్యార్థులు, వాటిని సంరక్షించే బాధ్యత ఇంటి యజమాని తీసుకునేలా ప్రోత్సహించారు. కార్యక్ర మంలో ప్రిన్సిపాల్ భక్తవత్సలం, ప్రోగ్రాం అధికారి బాలమోహన్, అధ్యాపకులు జునీద్‌బాషా, రఘునాథ్‌రెడ్డి, సురేష్ విద్యార్థులున్నారు.

కోడూరు తోపులో పేదలకు ఇంటి పట్టాలివ్వాలి

తహసీల్దార్‌కు సీపీఎం నాయకుల వినతి



తహసీల్దార్ భాగ్యలతకు వినతి పత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

చిలమత్తూరు, ఫిబ్రవరి 26: ఏడు నెలలుగా ఇంటి స్థలాల కోసం నిరసనలు ఆందోళనలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం వెంటనే పేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు వెంకటేశులు, పెద్దన్న, ప్రవీణ్‌కుమార్‌తో పాటు పేదలు సోమవారం పెద్ద ఎత్తున నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ మండలంలో ఇంటి స్థలాలు లేని నిరుపేదలకు గతంలో కోడూరు తోపు వద్ద ఇంటి స్థలాలు ఇచ్చినట్లే ఇచ్చి వాటిని వెన క్కి తీసుకున్నారన్నారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదేళ్లు పూర్తి అవుతున్నా నిరుపేదలకు ఇంటి జాగ కరవైందన్నారు. దీంతో తాము బాధితుల తరపున హైకోర్టును ఆశ్రయించగా అర్హులకు 4 వారాల లోగా ఇంటి పట్టాలు ఇవ్వాలని కోర్టు ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. కోర్టు ఉత్తర్వులు ఇచ్చి 6 వారాలు కావస్తున్నా అధికారులు పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా వెంటనే హైకోర్టు ఉత్తర్వులు అమలుచేసి నిరుపేదలకు ఇంటి పట్టాలు అందజేయాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ భాగ్యలతకు వినతిపత్రం అందించారు. దీనికి తహసీల్దార్ స్పందిస్తూ ఈ విషయాన్ని సబ్‌కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని తెలిపారు.

నక్కలగుట్టలో కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి



తహసీల్దార్ అంజనాదేవికి వినతిపత్రం ఇస్తున్న పేదలు

పెనుకొండ టౌన్ (సోమందేపల్లి), ఫిబ్రవరి 26 : ఆక్రమణకు గురైన స్థలాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని నిరుపేదలకు పట్టాలు మంజూరు చేయడంతోపాటు కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు డిమాండ్ చేశారు. అర్హులైన లబ్ధిదారులతో కలిసి సోమవారం తహసీల్దార్ అంజనాదేవికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికార పార్టీకి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ భూములు దౌర్జన్యంగా ఆక్రమిస్తున్నారన్నారు. ఇప్పటికైనా కబ్జా భూములను ఆక్రమించు కుని పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. కార్మికసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాలస్వామి, చాంద్ బాషా, గంగులమ్మ, అంజినమ్మ, కవిత, రెడ్డమ్మ, వెంకటలక్ష్మమ్మ, పేదలు పాల్గొన్నారు.